SK1 one NEWS HD

సమాజాభివృద్ధి కోసం మా అక్షర పోరాటం

# శ్రీ సీమకిరణం

SEEMAKIRANAM TELUGU DAILY

ఎడిటర్ : యస్. నజీర్ అహ్మద్ బాషా

జాతీయ తెలుగు దినపత్రిక

www.seemakiranam.com
www.seemakiranamnews.com
epaper.seemakiranam.com

ప్రచురణ : కర్నూలు & శ్రీ పొట్టి శ్రీ రాములు నెల్లూరు జిల్లా.

PUBLISHED BY : KURNOOL & SRI POTTI SRIRAMULU NELLORE DISTRICT

ప్రచురణ : కర్నూలు, నెల్లూరు. | ఎడిటర్ : ఎస్. నజీర్ అహ్మద్ భాష | సంపుటి : 08 సంచిక : 167 | పేజీలు : 04, వెల రూ. 2 రూ/ | శనివారం 05-09-2026

# తెలంగాణ రాజకీయాల్లో తరువాత ఏం జరగనుంది..?

## కొండా సురేఖ, చిన్నారెడ్డిపైనా కూడా కాంగ్రెస్ అధిష్టానం వేటు

- పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడుతున్న నేతలకు సీఎం రేవంత్ బలమైన సంకేతం
- కొండా సురేఖ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తారా?
- ఆమె కాంగ్రెస్‌లో కొనసాగే అవకాశముందా?"
- మంత్రి వర్గం నుంచి కొండా సురేఖ బర్తరఫ్‌కు గవర్నర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సిఫార్సు



హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో సంచలన పరిణామాలు ఉత్కంఠ రేపుతున్నాయి. మంత్రివర్గం నుంచి కొండా సురేఖను బర్తరఫ్ చేయడంతో చిన్నారెడ్డిపైనా కూడా కాంగ్రెస్ హై కమాండ్ వేటు వేసింది. ప్లానింగ్ కమిషన్ వైస్ ఛైర్మన్‌గా చిన్నారెడ్డిని తొలగించింది. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి తన పంతాన్ని నెగ్గించుకున్నారు. దీంతో పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడుతున్న నేతలకు సీఎం రేవంత్ బలమైన సంకేతం పంపినట్లయింది. రాష్ట్రంలో ఇటీవల చోటుచేసుకున్న మిగతా 2 లో

# విమానాశ్రయాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

## విమానాశ్రయానికి అవసరమైన భూ సేకరణను పూర్తి చేసి ఇచ్చాం

- డిసెంబర్ నాటికి ఖరారు చేసి పనులకు అదే నెలలో శంకుస్థాపన చేస్తాం
- హెలీ టూరిజంతో తెలంగాణలో పర్యాటక రంగం మరింత అభివృద్ధికి అవకాశం ఉంటుంది
- హుస్సేన్ సాగర్‌లో సీ-ప్లేన్ ల్యాండింగ్‌కు సంబంధించిన నివేదికను రెండు వారాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తాం



హైదరాబాద్: తెలంగాణలో ఆదిలాబాద్, మామూనూరు (వరంగల్) విమానాశ్రయాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడుకి విజ్ఞప్తి చేశారు. మిగతా 2 లో



## కొండా సురేఖను బర్తరఫ్ చేయాలంటూ గవర్నర్ కు రేవంత్ రెడ్డి లేఖ.. చిన్నారెడ్డిపై వేటు

పార్టీలో నెలకొన్న వివాదాలకు తెరదించిన కాంగ్రెస్ అధిష్ఠానం

సురేఖను కేబినెట్ నుంచి తొలగించేందుకు హైకమాండ్ గ్రీన్ సిగ్నల్

ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ పదవి నుంచి చిన్నారెడ్డి తొలగింపు



'వాళ్లు బాత్‌రూమ్‌కు వెళ్లినా మాకు తెలిసిపోతుంది'..

## ఇరాన్‌పై ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

ఇరాన్‌పై అమెరికా నిఘా పూర్తిస్థాయిలో ఉందన్న ట్రంప్

అవసరమైతే మరోసారి దాడి చేస్తామని హెచ్చరిక

హర్మూజ్‌పై తమకు బలమైన పట్టు ఉందని వెల్లడి

ఇరాన్ తాజా దాడుల్లో 18 మంది మృతి

అమెరికా స్థావరాలపై ఇరాన్ ప్రతిదాడులు

## యూపీ ఎన్నికలకు ముందు బీఎస్పీలో కీలక పరిణామం..



మేనల్లుడు ఆకాశ్‌పై మాయావతి సంచలన నిర్ణయం

పెద్ద బాధ్యతలకు ఆకాశ్ ఆనంద్ ఇంకా పరిణతి చెందలేదన్న మాయావతి

కీలక పదవులకు దూరం చేసే సంకేతాలు

పార్టీలో కొనసాగుతారని స్పష్టీకరణ

'ఎక్స్' ప్రొఫైల్ మార్చిన ఆకాశ్ ఆనంద్

బీఎస్పీ జాతీయ కన్వీనర్ పదవిపై ఉత్కంఠ




## స్థానిక ఎన్నికలన్నీ ఈ ఏడాదిలోపు పూర్తిచేయాలి

- వెలిగొండ, పోలవరం ఎడమ కాలువకు నీటి విడుదలపై వైకాపా దుష్ప్రచారం
- జలాశయాల్లో నీళ్లున్నా పంటలకు ఇవ్వట్లేదని గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోంది
- కూటమి ప్రభుత్వం చేసిన ప్రతి మంచి ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉంది
- రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు సమాచారం అందించాలి
- నరసాపురంలో ప్రజల అధీనంలో ఉన్న 6 వేల ఎకరాలకు పట్టాలు లేవు

## అక్టోబరు నుంచి కొత్త పింఛన్లు: మంత్రి లోకేశ్

స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు పూర్తిస్థాయిలో సిద్ధం కావాలి



- వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ.. అర్హులకు కొత్త పింఛన్లు అందించాలి
- అక్టోబరులోగా స్థానిక ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుంది
- విద్యాశాఖను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న కుట్రలపై అప్రమత్తంగా ఉండాలి
- కొన్ని సమస్యలు ఒకరిద్దరు అధికారుల పనితీరుతోనే ఉత్పన్నమయ్యాయి

# ఉత్తరాంధ్ర ఉన్నతాంధ్రగా మారుతుంది

## గోదావరి జలాలు తెచ్చిన చంద్రబాబుకు ఉత్తరాంధ్ర రైతుల జేజేలు..

- పాయకరావుపేటలో పండగ వాతావరణం
- దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు
- పాయకరావుపేట వద్ద నీటిని విడుదల చేసి జలహారతి ఇచ్చిన సీఎం చంద్రబాబు
- 4 జిల్లాల్లో 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 9 లక్షల మందికి తాగునీరు
- ఇక ఉత్తరాంధ్రకే వలసలు వస్తాయన్న ముఖ్యమంత్రి
- గోదావరి జలాలు తీసుకొచ్చిన చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపిన రైతులు



అమరావతి: "ఉత్తరాంధ్రకు గోదావరి నీళ్లు వచ్చాయి. ఇక ఈ ప్రాంతంలోని బీళ్లన్నీ పంటలతో కళకళలాడతాయి. అన్నవరం సత్యదేవుడి ఆశీస్సులతో



అనకాపల్లికి వచ్చిన గోదారమ్మను.. వచ్చే ఏడాదికి సింహాచలం అప్పన్న చెంతకు, ఆపై అరసవల్లి సూరీడి పాదాల వద్దకు తీసుకెళ్లి, వంశధార వరకు గోదావరి జలాలను తరలిస్తాం" అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా తొలి దశలో మిగతా 2



## ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-- 2026కు రండి

- హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7 నుంచి మూడు రోజులపాటు ఈ సదస్సు
- సదస్సులో భాగంగా రక్షణ ఎక్స్‌పో--2026ను ప్రారంభించాలని వినతి
- ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు కోసం మరో 750 ఎకరాల భూసేకరణకు సిద్ధమని వెల్లడి

## వైఎస్సార్ హయాంలోనే 79 శాతం కాలువ పనులు పూర్తయ్యాయి

### ప్రజాధనంతో ప్రభుత్వం పబ్లిసిటీ స్టంట్లు చేస్తోంది

- క్రెడిట్ కొట్టేసేందుకే స్టంట్లు.. కూటమి ప్రభుత్వంపై జగన్ ఆరోపణలు
- సాగునీటి ప్రాజెక్టులపై కూటమి ప్రభుత్వాన్ని విమర్శించిన జగన్
- పాత ప్రాజెక్టులకు క్రెడిట్ కొట్టేయాలని చూస్తున్నారని ఆరోపణ
- పురుషోత్తపట్నం నీటిని పోలవరం నీళ్లుగా చూపిస్తున్నారన్న జగన్



అమరావతి: వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వం కొత్తగా పనులేమీ చేపట్టకుండా, మిగతా 2 లో

## కేబినెట్ నుంచి తొలగింపు.. కొండా సురేఖ ఏమన్నారంటే?

### జగ్గారెడ్డి, రాజగోపాల్ రెడ్డిపై చర్యలేవని సూటి ప్రశ్న

- కేబినెట్ నుంచి తనను తొలగించడాన్ని ఖండించిన కొండా సురేఖ
- వివరణ అడగకుండానే నిర్ణయం తీసుకున్నారని ఆవేదన
- కూతురి వ్యాఖ్యలకు నేను బాధ్యురాలిని కాదంటూ స్పష్టీకరణ



హైదరాబాద్: తెలంగాణ మంత్రివర్గం నుంచి తనను బర్తరఫ్ చేయడంపై మంత్రి కొండా సురేఖ తీవ్రంగా స్పందించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనను కేబినెట్ నుంచి తొలగించాలని గవర్నర్‌కు సిఫార్సు చేసిన నేపథ్యంలో, ఈ నిర్ణయాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. ఎటువంటి ముందస్తు సమాచారం మిగతా 2 లో

## ‘వాళ్లు బాత్‌రూమ్‌కు వెళ్లినా మాకు తెలిసిపోతుంది’.. ఇరాన్‌పై ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

ఢిల్లీ: అమెరికా-ఇరాన్ మధ్య మరోసారి ఉద్రిక్తతలు పెరిగాయి. ఇరాన్‌పై తమ నిఘా ఎంత పకడ్బందీగా ఉందో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. ఇరాన్‌లో ఏం జరుగుతుందో తమకు ఎప్పటికప్పుడు తెలుస్తోందన్నారు. అవసరమైతే ఎప్పుడైనా మరో దాడి చేసేందుకు అమెరికా సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఓవల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడిన ట్రంప్.. తాజా ఘర్షణ ఎక్కువ కాలం సాగదని అభిప్రాయపడ్డారు. ఇరాన్ కదలికలపై అమెరికాకు పూర్తి సమాచారం ఉందన్నారు. “వాళ్లు బాత్‌రూమ్‌కు వెళ్లినా మాకు తెలిసిపోతుంది” అంటూ అమెరికా నిఘా సామర్థ్యాన్ని వివరించారు. హర్మూజ్ జలసంధిపై తమకు బలమైన పట్టు ఉందని ట్రంప్ పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో ఇరాన్ ఏర్పాటు చేస్తున్న రాడార్, క్షిపణి వ్యవస్థలను అమెరికా గుర్తించిందన్నారు. సముద్రంలో మైన్స్ వేసేందుకు ఇరాన్ సిద్ధం చేస్తున్న రాకెట్‌ను దాడిలో ధ్వంసం చేశామని చెప్పారు. తాజా అమెరికా దాడుల్లో ఇరాన్‌లో కనీసం 18 మంది చనిపోయారు. మరో 108 మంది గాయపడ్డారు. హర్మూజ్ సమీపంలోని కుహెస్తాక్‌లో జరిగిన వివాహ వేడుకపై కూడా దాడి జరిగినట్లు టెహ్రాన్ తెలిపింది. అమెరికా దాడులకు ప్రతిగా ఇరాన్ కూడా ఎదురుదాడులకు దిగింది. కువైట్, జోర్డాన్, యూఏఈ, బహ్రెయిన్, ఇరాక్‌లోని కుర్దిస్థాన్ ప్రాంతాల్లో ఉన్న అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకుంది. కువైట్‌లో ఇరాన్ నుంచి వచ్చిన క్షిపణి, డ్రోన్ దాడిని అడ్డుకున్నట్లు అక్కడి సైన్యం తెలిపింది.

## యూపీ ఎన్నికలకు ముందు బీఎస్పీలో కీలక పరిణామం..

ఢిల్లీ: బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ)లో కీలక పరిణామం చోటుచేసుకుంది. పార్టీ అధినేత్రి మాయావతి తన మేనల్లుడు ఆకాశ్ ఆనంద్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. పెద్ద బాధ్యతలు చేపట్టే స్థాయిలో ఆయన ఇంకా పరిణతి సాధించలేదని స్పష్టం చేశారు. దీంతో వచ్చే ఏడాది జరగనున్న ఉత్తర్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ జాతీయ కన్వీనర్‌గా ఆకాశ్ ఆనంద్ పార్టీని నడిపించే అవకాశం లేదనే సంకేతాలు వెలువడ్డాయి. బీఎస్పీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన జాతీయ కమిటీ సమావేశంలో మాయావతి ఈ వ్యాఖ్యలు చేశారు. ఆకాశ్ ఆనంద్ పార్టీలో కొనసాగుతారని, అయితే ప్రస్తుతం ఆయనకు కీలక బాధ్యతలు అప్పగించడం సరికాదని చెప్పారు. పరిస్థితులను ఆయన పరిణతితో ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు. “ఆకాశ్ ఆనంద్ పార్టీలో పనిచేయడానికి నేను అనుమతించాను. అయితే ఈ విషయంలో ఆయన మరింత పరిణతి సాధించాలి. అప్పటివరకు ఆయనకు ముఖ్యమైన పార్టీ బాధ్యతలు అప్పగించడం సముచితం కాదు” అని మాయావతి పేర్కొన్నారు. పార్టీని కాపాడుకోవడంతో పాటు ప్రజలకు మరింత చేరువ కావడంపై దృష్టి పెట్టాలని ఆమె పార్టీ నేతలకు సూచించారు. ప్రత్యర్థులు లంచాలు, బెదిరింపులు, వివక్ష వంటి మార్గాలతో బీఎస్పీని బలహీనపరిచే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. మాయావతి వ్యాఖ్యల తర్వాత ఆకాశ్ ఆనంద్ తన ‘ఎక్స్’ ప్రొఫైల్‌ను కూడా మార్చారు. గతంలో బీఎస్పీ జాతీయ కన్వీనర్‌గా ఉన్న ఆయన ఇప్పుడు తన ప్రొఫైల్‌లో ‘బీఎస్పీ కార్యకర్త’గా పేర్కొన్నారు. దీంతో ఆయన మద్దతుదారుల్లో నిరాశ వ్యక్తమైంది. ఆకాశ్ ఆనంద్‌ను 2025 ఆగస్టులో బీఎస్పీ జాతీయ కన్వీనర్‌గా నియమించారు. దీంతో ఆయన మాయావతి తర్వాత పార్టీలో కీలక నేతగా ఎదుగుతున్నారనే అంచనాలు ఏర్పడ్డాయి. యువతను బీఎస్పీ వైపు తీసుకురావడంతో పాటు యూపీలో పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తారని అప్పట్లో మాయావతి ప్రకటించారు. తాజా పరిణామాలతో ఆ అంచనాలపై అనిశ్చితి నెలకొంది.

## కొండా సురేఖను బర్తరఫ్ చేయాలంటూ గవర్నర్ కు రేవంత్ రెడ్డి లేఖ.. చిన్నారెడ్డిపై వేటు

హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్ సర్కార్, పార్టీలో నెలకొన్న తీవ్ర వివాదాలకు అధిష్ఠానం తెరదించింది. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించేందుకు ఏఐసీసీ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో, ఆమెను బర్తరఫ్ చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. సురేఖ స్వచ్ఛందంగా రాజీనామా చేసేందుకు నిరాకరించిన నేపథ్యంలో, ఆమెను కేబినెట్ నుంచి తొలగించాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డి గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకు అధికారికంగా సిఫారసు లేఖను పంపించారు. కొండా సురేఖ కుమార్తె సీఎంపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు, ఆ తదనంతరం చోటుచేసుకున్న పరిణామాలు కాంగ్రెస్ క్రమశిక్షణా కమిటీ సిఫారసులకు, చివరికి బర్తరఫ్‌కు దారితీశాయి. మరోవైపు పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించిన సీనియర్ నేత చిన్నారెడ్డిపై కూడా కాంగ్రెస్ ప్రభుత్వం వేటు వేసింది. ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ పదవి నుంచి చిన్నారెడ్డిని తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో జీహెచ్ఎంసీ మాజీ మేయర్ గద్వాల విజయలక్ష్మిని ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్‌పర్సన్‌గా నియమించింది. వీటితో పాటు ఇతర కీలక పదవుల్లోనూ ప్రభుత్వం నియామకాలు చేపట్టింది. మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద, కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్‌పర్సన్‌గా గుండు సుధారాణిలను నియమిస్తూ అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి.

## ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్--2026కు రండి

న్యూఢిల్లీ: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్--2026కు హాజరు కావాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7 నుంచి మూడు రోజులపాటు జరిగే ఈ సదస్సులో భాగంగా రక్షణ ఎక్స్‌పో--2026ను ప్రారంభించాలని కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా రేవంత్‌రెడ్డి రాజ్‌నాథ్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో తెలంగాణ కార్మిక, గనుల శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి, ఎంపీలు ఎం.అనిల్‌కుమార్ యాదవ్, డాక్టర్ మల్లు రవి, సురేశ్ షెట్కార్, పోరిక బలరాం నాయక్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రొటోకాల్) హర్కర వేణుగోపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్లోబల్ సమ్మిట్ లక్ష్యాలను రాజ్‌నాథ్‌కు సీఎం వివరించారు. రక్షణ రంగంలో పెట్టుబడులు పెట్టడానికి రాష్ట్రంలో ఉన్న అవకాశాలను వారిద్దరూ చర్చించారు.

ఏరోస్పేస్, రక్షణ, అంతరిక్ష రంగాలపై ప్రత్యేక సదస్సుతోపాటు ఎయిర్ షో, ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్, భూఉపరితల రక్షణ వ్యవస్థలకు సంబంధించిన లైవ్ డెమోలు డిఫెన్స్ ఎక్స్‌పోలో ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి రాజ్‌నాథ్‌కు వివరించారు. ఈ దృష్ట్యా డిఫెన్స్ ఎక్స్‌పోకు ముఖ్యఅతిథిగా హాజరుకావాలని, ఆహూతులకు మార్గనిర్దేశం చేయాలని కోరారు. ఎయిర్ షో నిర్వహణకు గగనతల అనుమతుల మంజూరు చేయాలని.. యుద్ధ విమానాల భాగస్వామ్యంతోపాటు సూర్యకిరణ్, సారంగ్ ఏరోబాటిక్ బృందాల ప్రదర్శనలు ఉండేలా ఆదేశాలివ్వాలని విన్నవించారు. స్టాటిక్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రదర్శనకు కూడా మద్దతు అందించాలన్నారు. త్రివిధ దళాలకు చెందిన అత్యాధునిక రక్షణ వ్యవస్థల డెమోలను ఈ ఎక్స్‌పోలో ఏర్పాటు చేయాలని కోరారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించిన భూసేకరణ గురించి రాజ్‌నాథ్ సింగ్, రేవంత్‌రెడ్డి మధ్య చర్చ జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 750 ఎకరాల భూమిని సేకరించిందని రేవంత్ చెప్పారు. ఈ విమానాశ్రయం కోసం రక్షణ శాఖ మొత్తం 1,500 కోరిందని.. ఆ మేరకు మరో 750 ఎకరాల భూసేకరణ ప్రక్రియ చేపడతామని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో డీఆర్‌డీఎల్ ప్రాజెక్టు కోసం 416.18 ఎకరాలను నామమాత్రపు రుసుముతో 33 ఏళ్ల లీజు ప్రాతిపదికన కేటాయించనున్నట్లు రాజ్‌నాథ్‌కు సీఎం వివరించారు.

## మంత్రి కొండా సురేఖను బర్తరఫ్ చేయండి.. గవర్నర్‌కు సీఎం లేఖ



హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. మంత్రి కొండా సురేఖ , ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై కాంగ్రెస్ అధిష్ఠానం వేటు వేసింది. ఈ మేరకు హైకమాండ్ నిర్ణయం తీసుకుంది. క్యాబినెట్ నుంచి సురేఖను తొలగించేందుకు అధిష్ఠానం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో సీఎం రేవంత్‌రెడ్డి (=వఝుత్‌ష్ట్ర =వ౧౧౧౧) గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లాకు లేఖ పంపారు. ఆమెను తక్షణమే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని సీఎం కోరారు. రాజీనామాకు కొండా సురేఖ ససేమిరా అనడంతో ఆమెను తొలగించాలని సీఎం సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది. సీఎం లేఖపై గవర్నర్ త్వరలో నిర్ణయం తీసుకోనున్నారు.

చిన్నారెడ్డి స్థానంలో గద్వాల్ విజయలక్ష్మి

మరోవైపు ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా ఉన్న చిన్నారెడ్డి స్థానంలో జీహెచ్ఎంసీ మాజీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని సీఎం రేవంత్ నియమించారు. రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద, కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్‌పర్సన్‌గా జి.సుధారాణి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఏం జరిగిందంటే..

ఇటీవల పరకాల నియోజకవర్గం గీసుకొండలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని కించపరిచేలా ఆమె వ్యాఖ్యలు చేశారు. దీనిపై వివరణ ఇవ్వాలంటూ కొండా సురేఖకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ (డీఏసీ) షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఆమె తన వివరణ పంపారు. కుమార్తె వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని.. వాటితో తనకు సంబంధం లేదని పేర్కొన్నారు. ఆమె చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయొద్దని కోరారు. మరోవైపు వనపర్తి వ్యవహారంలో ఎమ్మెల్యే మేఘారెడ్డిపై మాజీ మంత్రి చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలు కూడా చర్చనీయాంశమయ్యాయి. వివరణ ఇవ్వాలని ఆయనకూ డీఏసీ షోకాజ్ నోటీసు జారీ చేసింది. సురేఖ, చిన్నారెడ్డి ఇచ్చిన వివరణలను హైకమాండ్‌కు పీసీసీ పంపింది. కొండా సురేఖతో పాటు చిన్నారెడ్డి వ్యవహారంపై గత రెండు రోజులుగా కాంగ్రెస్ అధిష్ఠానంతో సీఎం రేవంత్, ముఖ్యనేతలు చర్చలు జరిపారు. 2023 డిసెంబరులో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏర్పడిన మంత్రివర్గంలో స్థానం పొందిన సురేఖ వ్యవహారం గతంలో కూడా వివాదాస్పదమైనా, ఈసారి సీఎం రేవంత్‌రెడ్డి చర్యకు గట్టిగా పట్టుబట్టారు. పీసీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి కూడా చర్య తీసుకోవాలనడం, పీసీసీ క్రమశిక్షణ కమిటీ సైతం అదే సిఫార్సు చేసిన నేపథ్యంలో అధిష్ఠానం కూడా వారిద్దరిపై వేటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది.

# ఉత్తరాంధ్ర ఉన్నతాంధ్రగా మారుతుంది

ఈ ప్రాజెక్టు ద్వారా తొలి దశలో తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ, అనకాపల్లి జిల్లాల్లో 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 9 లక్షల మందికి తాగునీరు అందుతుందని తెలిపారు. పోలవరం ఎడమ కాలువ కోసం ఇప్పటివరకు రూ.4,192 కోట్లు ఖర్చు చేశామని, మరో రూ.800 కోట్లతో మిగిలిన పనులు పూర్తి చేస్తామని చెప్పారు. ఈ నీటితో విశాఖ, అనకాపల్లి పారిశ్రామిక, తాగునీటి అవసరాల కోసం 23.44 టీఎంసీలు తరలించనున్నట్టు వివరించారు.

“2019లో వచ్చిన గొడ్డలి పార్టీ పోలవరం ప్రాజెక్టును సర్వనాశనం చేసింది. డయాఫ్రామ్ వాల్ కొట్టుకుపోయేలా చేసింది. 2024లో ప్రజలు కూటమిని గెలిపించి పోలవరానికి శాప విముక్తి కలిగించారు” అని చంద్రబాబు విమర్శించారు. ప్రతి నీటి చుక్క వెనుక ఇంజినీర్ల ప్రతిభ, కార్మికుల కష్టం, రైతుల నిరీక్షణ, నిర్వాసితుల త్యాగం ఉన్నాయని కొనియాడారు.

“గతంలో ఉత్తరాంధ్ర నుంచి వలసలు వెళ్లేవారు. ఇకపై ఉత్తరాంధ్రకే వలసలు వచ్చే పరిస్థితి కల్పిస్తాం. విశాఖ ఏఐ పట్నంగా, నాలెడ్జ్ ఎకానమీ కేంద్రంగా మారుతుంది. ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్, డేటా సెంటర్లు, ఐటీ కంపెనీలతో ఈ ప్రాంతం అభివృద్ధికి చిరునామాగా నిలుస్తుంది” అని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. డేటా సెంటర్లకు నీటి కొరత వస్తుందన్నది తప్పుడు ప్రచారమని, వాటికి అవసరమైన 5 టీఎంసీల కంటే ఎడమ కాలువ ద్వారా ఎన్నో రెట్ల నీరు అందుబాటులో ఉంటుందని స్పష్టం చేశారు.

### దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు

దశాబ్దాల కాలం నాటి కల సాకారమైంది. ఉత్తరాంధ్ర బీళ్లకు జీవం పోసేందుకు గోదారమ్మ పరవళ్లు తొక్కుతూ తరలివచ్చింది. ఈ చారిత్రక ఘట్టంతో పులకించిపోయిన ఉత్తరాంధ్ర రైతులు, ప్రజలు.. తమ ప్రాంతానికి గోదావరి జలాలు తీసుకొచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు మనసారా కృతజ్ఞతలు తెలిపారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట వద్ద పోలవరం ఎడమ ప్రధాన కాలువ నుంచి గోదావరి జలాలను విడుదల చేసిన ముఖ్యమంత్రి, ఈ అపూర్వ ఘట్టానికి ప్రత్యక్ష సాక్షిగా నిలిచారు. పాయకరావుపేట వద్ద క్రాస్ రెగ్యులేటర్ నుంచి ఉత్తరాంధ్ర భూముల్లోకి అడుగుపెట్టిన గోదావరి జలాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక పూజలు నిర్వహించి, జలహారతి ఇచ్చారు. అరుణ వర్ణంలో ప్రవహిస్తున్న పవిత్ర జలాలను శిరస్సున చల్లుకుని, భావోద్వేగంతో కాలువలో నిల్చుని పుష్పాలు, పసుపు కుంకుమ సమర్పించారు. అనంతరం గోదావరి తల్లికి సాష్టాంగ నమస్కారం చేసి తన ప్రణామం అర్పించారు. ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో తరలివచ్చిన స్థానిక రైతులు, మహిళలు హారతులు పడుతూ, పూలు చల్లుతూ గోదారమ్మకు స్వాగతం పలికారు.

## తెలంగాణ రాజకీయాల్లో తరువాత ఏం జరగనుంది..?

మొదటి పేజి తరువాయి

రాష్ట్రంలో ఇటీవల చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలు, మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత సీఎంను ఉద్దేశించి చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు, దీనిపై వ్యక్తమైన భిన్నాభిప్రాయాలు, ప్రభుత్వంపై కొందరు ఎమ్మెల్యేలు, నేతలు బహిరంగంగా చేస్తున్న వ్యాఖ్యలు, జిల్లాల్లో బయటపడుతున్న విభేదాల నేపథ్యంలో రాష్ట్ర నేతలను ఢిల్లీకి పిలిపించిన అధిష్టానం వారితో చర్చించిన సంగతి తెలిసిందే. తన పైన కొండా సురేఖ కుమార్తె చేసిన వ్యాఖ్యలను రేవంత్‌రెడ్డి సీరియస్‌గా తీసుకున్నారు. కొండా సురేఖ ఆ వ్యాఖ్యలను ఖండించకపోవటం, అనంతరం ఆమె స్వయంగా చేసిన వ్యాఖ్యలతో ఆగ్రహంతో ఉన్న రేవంత్.. సురేఖ చేసిన ఆరోపణలను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఖర్గేకు వివరించారు. కొండా సురేఖ వ్యవహారాన్ని ఉపేక్షిస్తే పార్టీ కేడర్‌కు తప్పుడు సంకేతాలు వెళ్లడంతో పాటు రాష్ట్ర నాయకత్వంపై లేనిపోని అపోహలకు తావిచ్చినట్లు అవుతుందని సీఎం చెప్పినట్లుగా తెలిసింది. ఇంత జరిగాక కూడా ఆమెపై చర్యలు తీసుకోకుండా ఉపేక్షించడం తగదని అన్నట్లు సమాచారం. రేవంత్ పట్టుతో కొండా సురేఖ, చిన్నారెడ్డిపైనా కూడా కాంగ్రెస్ అధిష్టానం వేటు వేసింది. మంత్రి వర్గం నుంచి కొండా సురేఖ బర్తరఫ్‌కు గవర్నర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సిఫార్సు చేశారు. ఇదిలా ఉండగా.. కొండా ఫ్యామిలీ ఏ పార్టీలో చేరబోతుంది?. తెలంగాణ రాజకీయాల్లో తరువాత ఏం జరగనుంది?. కొండా రాజకీయ భవిష్యత్తు ఎలా ఉండబోతుంది?. కొండా సురేఖ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తారా?. ఆమె కాంగ్రెస్‌లో కొనసాగే అవకాశముందా?” అనే చర్చ నడుస్తోంది.

## వైఎస్సార్ హయాంలోనే 79 శాతం కాలువ పనులు పూర్తయ్యాయి

మొదటి పేజి తరువాయి

సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వం కొత్తగా పనులేమీ చేపట్టకుండా, కేవలం ప్రచార ఆర్భాటాలకే పరిమితమవుతోందని విమర్శించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ‘ఎక్స్’ వేదికగా ఆయన స్పందించారు. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం పంపుల ద్వారా నీటిని ఎత్తిపోస్తూ, వాటిని పోలవరం ప్రాజెక్టు జలాలుగా చూపిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రచారం చేసుకుంటున్నారని జగన్ విమర్శించారు. పురుషోత్తపట్నం పంపులు కానీ, పోలవరం ఎడమ ప్రధాన కాలువ కానీ ప్రస్తుత ప్రభుత్వం నిర్మించినవి కావని ఆయన స్పష్టం చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే పోలవరం ఎడమ కాలువకు సంబంధించి 79 శాతం పనులు పూర్తయ్యాయని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. క్షేత్రస్థాయిలో కొత్తగా ఎటువంటి పనులు చేపట్టకుండా, గతంలో పూర్తయిన ప్రాజెక్టుల ద్వారా లబ్ధి పొందాలని ప్రభుత్వం ఆరాటపడుతోందని జగన్ ఆక్షేపించారు. ప్రజాధనంతో ప్రాజెక్టుల వద్ద ప్రచార కార్యక్రమాలు, పబ్లిసిటీ స్టంట్లు నిర్వహించడం అత్యంత దారుణమని ఆయన పేర్కొన్నారు.


## కేబినెట్ నుంచి తొలగింపు.. కొండా సురేఖ ఏమన్నారంటే?

మొదటి పేజి తరువాయి

ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా, కనీసం తన వివరణ కూడా కోరకుండా ఏకపక్షంగా ఇటువంటి చర్యలు తీసుకోవడం భావ్యం కాదని ఆమె ఆక్షేపించారు. ఇటీవల తన కుమార్తె చేసిన వ్యాఖ్యల వల్ల తలెత్తిన వివాదంపై ఆమె స్పందిస్తూ, “నా కుమార్తె స్వతంత్ర వ్యక్తిత్వం కలిగిన మహిళ. ఆమె వ్యక్తం చేసిన అభిప్రాయాలకు నేను బాధ్యురాలిని ఎలా అవుతాను? ఆమె వ్యాఖ్యలను ఖండించాల్సిన అవసరం నాకు లేదు. ఆమె వ్యక్తిగత అభిప్రాయాలను విమర్శించే హక్కు ఎవరికీ లేదు” అని స్పష్టం చేశారు. ఈ మొత్తం వ్యవహారంపై కాంగ్రెస్ అధిష్ఠానానికి తాను సమర్పించిన లేఖను త్వరలోనే మీడియాకు విడుదల చేస్తానని ఆమె వెల్లడించారు. ఇదే క్రమంలో పార్టీలోని ద్వంద్వ వైఖరిని ఆమె నిలదీశారు. గతంలో జగ్గారెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై పార్టీ ఎటువంటి చర్యలు తీసుకుందని ఆమె ప్రశ్నించారు. కొండా సురేఖ ఉదంతంతో తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు మరింత తీవ్రమవుతున్నాయని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కాగా, కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తక్షణమే తొలగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాకు లేఖ రాశారు. కొండా సురేఖ రాజీనామాకు నిరాకరించడంతో, ఆమెను బర్తరఫ్ చేయడానికే కాంగ్రెస్ అధిష్ఠానం మొగ్గు చూపింది.

## అక్టోబరు నుంచి కొత్త పింఛన్లు: మంత్రి లోకేశ్

### స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు పూర్తిస్థాయిలో సిద్ధం కావాలి



అమరావతి: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ దశల వారీగా కొత్త పింఛన్లు మంజూరు చేయనున్నట్టు తెదేపా వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ తెలిపారు. వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ.. అర్హులకు కొత్త పింఛన్లు అందించాలని మంత్రులకు సూచించారు. కేబినెట్ భేటీకి ముందు మంత్రులతో సమావేశమైన లోకేశ్.. పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు పూర్తిస్థాయిలో సిద్ధమై.. అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. అక్టోబరులోగా స్థానిక ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని, ఎన్నికలు వాయిదా పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న అంశాలను కూడా త్వరగా పరిష్కరించి.. అన్ని స్థానాల్లో ఎన్నికలు నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. మొదట పురపాలక ఆతర్వాత ఎంపీటీసీ, జడ్పీటీసీ, అనంతరం పంచాయతీ ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. స్థానిక ఎన్నికలు వాయిదా పడితే ఫైనాన్స్ కమిషన్ నిధులు నిలిచిపోయి.. రాష్ట్రానికి నష్టం జరుగుతుందనే దురుద్దేశంతో ప్రతిపక్షం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. విద్యాశాఖను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న కుట్రలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మాట వినని అధికారులు, శాఖకు లేదా మంత్రికి చెడ్డపేరు తెచ్చేలా వ్యవహరించే అధికారుల విషయంలో ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుందామని తెలిపారు. ఇటీవల కొన్ని సమస్యలు ఒకరిద్దరు అధికారుల పనితీరుతోనే ఉత్పన్నమయ్యాయని అభిప్రాయపడ్డారు. వైద్య రంగంలో చిన్న పొరపాటు జరిగినా సోషల్ మీడియాలో.. ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని ట్రోలింగ్ జరుగుతోందని, ఇలాంటి అంశాలపై కూడా మంత్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. (సెప్టెంబరు 9న) అధినేత చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించి, అన్యాయంగా నిర్బంధించి మూడేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించాలని లోకేశ్ సూచించారు. నాటి దుశ్చర్య నుంచి ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ.. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న తీరును ప్రజలకు గుర్తు చేసేలా కార్యక్రమం ఉండాలన్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున.. ముందస్తు ప్రణాళికలు, పొదుపు చర్యలతో సమస్యను అధిగమిద్దామని లోకేశ్ సూచించారు.

## విమానాశ్రయాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

మొదటి పేజి తరువాయి

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడుకి విజ్ఞప్తి చేశారు. మామూనురు విమానాశ్రయానికి అవసరమైన భూ సేకరణను పూర్తి చేసి ఇచ్చామని తెలిపారు. ఢిల్లీలోని పౌర విమానయాన శాఖ కార్యాలయం రాజీవ్ గాంధీ భవన్‌లో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తో ముఖ్యమంత్రి గారు సమావేశమయ్యారు. ఆదిలాబాద్ విమానాశ్రయంలో కార్గో, ప్యాసింజర్ టెర్మినల్, ఎంఆర్‌వో (మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్) వసతులు ఏర్పాటు చేయాలని కోరారు. ఆదిలాబాద్‌లో రన్‌వే ఫైనలైజ్ చేయడానికి సంబంధించి రక్షణ, పౌర విమానయాన శాఖల సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి గారికి విజ్ఞప్తి చేశారు. మామునూరు (వరంగల్) విమానాశ్రయం టెండర్లను రెండు వారాల్లో పిలిచి డిసెంబర్ నాటికి ఖరారు చేసి పనులకు అదే నెలలో శంకుస్థాపన చేస్తామని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి తెలిపారు. తెలంగాణలో చాపర్ల ద్వారా హెలీ టూరిజం అభివృద్ధికి కృషి చేయాలని రామ్మోహన్ నాయుడు కి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. హెలీ టూరిజంతో తెలంగాణలో పర్యాటక రంగం మరింత అభివృద్ధికి అవకాశం ఉంటుందని చెప్పారు. హుస్సేన్ సాగర్‌లో సీ-ప్లేన్ ల్యాండింగ్‌కు సంబంధించిన నివేదికను రెండు వారాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని ఈ సందర్భంగా పౌర విమానయాన శాఖ అధికారులు ముఖ్యమంత్రి గారికి తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్ గారు, సురేశ్ షెట్కార్ గారు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రొటోకాల్) హర్కార వేణుగోపాల రావు గారు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గారు, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్ గారితో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికలన్నీ ఈ ఏడాదిలోపు పూర్తిచేయాలి



అమరావతి: జలాశయాల్లో నీళ్లున్నా పంటలకు ఇవ్వట్లేదని గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని సీఎం చంద్రబాబు దుయ్యబట్టారు. వాటిని సమర్థంగా తిప్పికొట్టడంతోపాటు ప్రజలకు వాస్తవ పరిస్థితులు వివరించాలని మంత్రులను ఆదేశించారు. క్యాబినెట్ భేటీ ముగిసిన అనంతరం మంత్రులతో సీఎం మాట్లాడారు. తాము చేసిన ప్రారంభోత్సవాలను వారి ఘనతగా గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫేక్ ప్రచారాలు చేయడంలో వైకాపా ముందుంటుందన్నారు. వెలిగొండ, పోలవరం ఎడమ కాలువకు నీటి విడుదలపై ఆ పార్టీ దుష్ప్రచారం చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం చేసిన ప్రతి మంచీ ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. మంత్రులు నిత్యం ప్రజల్లో ఉంటూ వారికి అన్ని వాస్తవాలు చెప్పాలన్నారు. ఈ సందర్భంగా జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఇంజినీరింగ్ అధికారులను సీఎం అభినందించారు. రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు సమాచారం అందించాలని సీఎం చంద్రబాబు సూచించారు. ప్రజలకు వాస్తవ పరిస్థితులు వివరించేందుకు అందరినీ భాగస్వాముల్ని చేద్దామన్నారు. నిత్యావసర ధరలు పెరగకుండా చూడాలని మంత్రులకు సీఎం సూచించారు. రైతు బజార్లలో బియ్యం తక్కువ ధరకు ఇస్తున్నట్లు ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల తెలిపారు. మిగిలిన వాటి ధరల నియంత్రణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీఎం సూచించారు. సీడ్ బాల్స్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను సీఎం ఆదేశించారు. స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు గెలుపొందేలా ఇన్‌ఛార్జ్ మంత్రులు బాధ్యత తీసుకోవాలన్నారు. జిల్లాల్లో జఠిల సమస్యల పరిష్కారానికి వారిదే బాధ్యతని చెప్పారు. నరసాపురంలో ప్రజల అధీనంలో ఉన్న 6 వేల ఎకరాలకు పట్టాలు లేవని, రెండు నెలల్లో సమస్య పరిష్కరించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి భూములు ఎక్కడున్నాయో గుర్తించి పట్టాలివ్వాలన్నారు. సూర్యఘర్ వినియోగంలో 4వ స్థానంలో ఉన్న ఏపీ మొదటి స్థానానికి రావాలన్నారు. 20 లక్షల కనెక్షన్లయినా వాడుకోవాలన్నారు.

స్థానిక ఎన్నికలన్నీ ఈ ఏడాదిలోపు పూర్తిచేయాలి

ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలన్నీ ఈ ఏడాదిలోపు పూర్తి చేయాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. వచ్చే ఏడాదికి ఏ ఎన్నికా మిగలకుండా కోర్టు సమస్యలన్నీ పరిష్కరించాలన్నారు. కోర్టు కేసులున్న 23 మున్సిపాలిటీలతో పాటు మిగిలిన 100 చోట్ల కూడా ఎన్నికలు జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

## హైకమాండ్‌ను సీఎం రేవంత్ బ్లాక్‌మెయిల్ చేశారు



హైదరాబాద్: తనను మంత్రివర్గం నుంచి తొలగించాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ హైకమాండ్‌ను బ్లాక్‌మెయిల్ చేశారని మంత్రి కొండా సురేఖ ఆరోపించారు. ఆమెను బర్తరఫ్ చేయాలంటూ గవర్నర్‌కు సీఎం లేఖ పంపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొండా సురేఖ మీడియా సమావేశం నిర్వహించారు. “నా వివరణ తీసుకోకుండా బర్తరఫ్ నిర్ణయం తీసుకున్నారు. ఉరిశిక్ష పడిన ముద్దాయిని కూడా చివరి కోరిక ఏంటని అడుగుతారు. ఏ తప్పు చేయకపోయినా.. ఎందుకు చేస్తున్నామో చెప్పకుండా నన్ను బర్తరఫ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా. మంత్రి పదవి నుంచి నన్ను తొలగించే ఉద్దేశం కాంగ్రెస్ హైకమాండ్‌కు లేదు. ఆ విషయం నాకు వంద శాతం తెలుసు. కానీ.. సీఎం రేవంత్‌రెడ్డి హైకమాండ్‌ను బ్లాక్‌మెయిల్ చేశారు. ఆమెను మంత్రి పదవి నుంచి తొలగిస్తారా? నన్ను రాజీనామా చేయమంటారా? అని సీఎం బెదిరించారు. నాతో పాటు మాజీ ఓఎస్డీ సుమంత్‌పై కుట్ర చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, సీఎం సోదరులు కొండల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి కక్షగట్టారు. నాకు తెలియకుండా సుమంత్‌ను తప్పించారు. పోలీసులపై ఒత్తిడి తెచ్చి ఆయన కుటుంబాన్ని ఇబ్బంది పెడుతున్నారు.

నేను తప్పు చేయలేదు.. అవమానంగా భావించను

నాపై చర్యలకు సిఫార్సు చేసిన క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి కూడా గతంలో కాంగ్రెస్‌ను తిట్టినవారే. గతంలో రోశయ్య, జైపాల్‌రెడ్డి కూడా ఇందిరాగాంధీని దూషించారు. మంత్రి పదవి నుంచి తొలగించినందుకు నేనేమీ బాధపడట్లేదు. నేను తప్పుచేయలేదు.. బర్తరఫ్‌ను అవమానంగా భావించడం లేదు. మేం ప్రజాబలం ఉన్న నాయకులం.. జనం మా వెంటే ఉంటారు. మంత్రులు, ఎమ్మెల్యేలూ.. మీరు సంతోషంగా ఉన్నారా?గుండెల మీద చేయి వేసుకుని చెప్పాలి. బయటకు వచ్చి మీ బాధలు చెప్పుకోండి. ప్రజాప్రతినిధులకే పనులు జరగని పరిస్థితి నెలకొంది.

కాంగ్రెస్‌కు రాజీనామా చేసే ఆలోచన లేదు

హామీలు నెరవేర్చకపోవడం వల్ల ప్రజల్లో వ్యతిరేకత వస్తోంది. క్షేత్రస్థాయి పరిస్థితిపై ప్రభుత్వం సర్వే చేయించుకుంటే మంచిది. ఇప్పటికైనా అందరూ బయటకు వచ్చి ధైర్యంగా మాట్లాడాలి. పనులు జరగాలంటే ఎవరి వద్దకు వెళ్లాలో తెలియని స్థితిలో ఎమ్మెల్యేలు ఉన్నారు. ప్రజలకు సేవ, ప్రాంతాన్ని అభివృద్ధి చేయలేకపోతున్నామనే బాధ అందరిలోనూ ఉంది. బర్తరఫ్‌పై పునరాలోచించుకోమని చెప్పను.. పార్టీ తీరు మారాల్సిన అవసరముంది. మళ్లీ కాంగ్రెస్ పార్టీ గెలవాలంటే చాలా మార్పులు చేసుకోవాలి. రేవంత్‌రెడ్డి ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదు. నావైపు ఒక వేలు చూపితే.. రేవంత్ వైపు నాలుగువేళు చూపుతాయి. ప్లాన్-బిపై ఇంకా ఏమీ ఆలోచించుకోలేదు. ఎమ్మెల్యేగా కొనసాగుతా. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసే ఆలోచన లేదు” అని కొండా సురేఖ అన్నారు.

# గణేశ్ మండపాలకు ఆన్‌లైన్‌లో అనుమతులు..!


ఒకే క్లిక్‌తో గణేశ్ మండపం అనుమతి!

సింగిల్ విండో విధానంలో అన్ని శాఖల అనుమతులు ఒకేచోట

మండపాల వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరి

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

వెల్దుర్తి సీఐ యుగంధర్, ఎస్సై నరేష్



**వెల్దుర్తి, సెప్టెంబర్ 04, (సీమకిరణం న్యూస్):** వినాయక చవితి వేడుకల సందర్భంగా గణేశ్ మండపాల ఏర్పాటుకు అవసరమైన అనుమతులను ఆన్‌లైన్‌లో పొందేందుకు సింగిల్ విండో విధానాన్ని ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వెల్దుర్తి సీఐ యుగంధర్ తెలిపారు. గురువారం వెల్దుర్తి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్సై నరేష్ తో కలిసి వినాయక ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెల్దుర్తి సీఐ యుగంధర్ మాట్లాడుతూ పోలీస్, అగ్నిమాపక, మున్సిపల్, విద్యుత్, రెవెన్యూ శాఖలకు సంబంధించిన అన్ని అనుమతులను ఒకే వేదిక ద్వారా పొందేలా ఈ విధానాన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు. గణేశ్ మండపాల నిర్వాహకులు గణేష్ ఉత్సవ్. నెట్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.






దరఖాస్తులో పొందుపరిచిన వివరాలను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించిన అనంతరం, అవసరమైతే మండపం ఏర్పాటు చేయనున్న ప్రదేశాన్ని క్షేత్రస్థాయిలో తనిఖీ చేస్తారు. భద్రతాపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అవసరమైన మార్పులు, ఇతర నిబంధనలపై నిర్వాహకులకు సూచనలు అందిస్తారు. వెల్దుర్తి పట్టణ పరిధిలో ఏర్పాటు చేసే గణేశ్ మండపాలకు నాలుగు రోజులపాటు, గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే మండపాలకు మూడు రోజులపాటు అనుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతి గణేశ్ మండపం వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు పోలీసు శాఖ సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. అనంతరం వెల్దుర్తి ఎస్సై నరేష్ మాట్లాడుతూ, వినాయక చవితి వేడుకల సందర్భంగా శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలిగించినా, ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వినాయక చవితి వేడుకలను ప్రశాంతమైన, భక్తి శ్రద్ధల వాతావరణంలో నిర్వహించేందుకు భక్తులు, గణేశ్ మండపాల నిర్వాహకులు పోలీసు శాఖకు పూర్తి సహకారం అందించాలని సీఐ యుగంధర్, ఎస్సై నరేష్ విజ్ఞప్తి చేశారు.

# ప్రజల నుంచి మా ప్రభుత్వానికి వంద మార్కులు

కర్నూలు అభివృద్ధిపై ప్రజల్లో సంతృప్తి ఉంది : మంత్రి టీజీ భరత్







**కర్నూలు ప్రతినిధి, సెప్టెంబర్ 04, (సీమకిరణం న్యూస్):** మా ప్రభుత్వ పాలన, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంపై ప్రజలు పూర్తి సంతృప్తితో ఉన్నారని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. కర్నూలు నగరంలో 10వ వార్డులో రెండేళ్ల నమ్మకం.. అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను నేరుగా కలిసి ప్రభుత్వ పనితీరుపై ఫీడ్‌బ్యాక్ తీసుకున్నామని, ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పనితీరుకు 100 మార్కులు ఇచ్చారని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ప్రజలు అభినందిస్తున్నారని మంత్రి తెలిపారు. అర్హత ఉన్న కొత్త లబ్ధిదారులకు త్వరలోనే పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కర్నూలు నగరంలో డ్రైనేజీ, విద్యుత్, రోడ్లు తదితర సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నామని మంత్రి పేర్కొన్నారు. వార్డు, క్లస్టర్, బూత్ స్థాయి నాయకులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇంచార్జి మెహబూబ్ ఖాన్, హజ్ కమిటీ సభ్యులు మన్సూర్ అలీ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

### హైకోర్టు బెంచ్‌పై అడ్వకేట్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు : మంత్రి టీజీ భరత్

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు విషయంలో అడ్వకేట్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర మంత్రి టీజీ భరత్ తెలిపారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారిని తాను వ్యక్తిగతంగా కలిసి కోరగా, కర్నూలుకు హైకోర్టు బెంచ్ తప్పకుండా వస్తుందని ముఖ్యమంత్రి స్పష్టమైన హామీ ఇచ్చారని చెప్పారు. మంత్రి నారా లోకేష్ కూడా హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై స్పష్టత ఇచ్చారని మంత్రి తెలిపారు. హైకోర్టు బెంచ్ ఏర్పాటు అనేది న్యాయపరమైన ప్రక్రియ, విధానాలకు అనుగుణంగా జరగాల్సిన అంశమని పేర్కొన్నారు. అందువల్ల అడ్వకేట్లు తొందరపడి నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం లేదని, ఆందోళనలు చేయకుండా ఓపికగా ఉండాలని మంత్రి టీజీ భరత్ విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వ పాలనలో హైకోర్టు విషయంలో ఇచ్చిన హామీ అమలు కాలేదని మంత్రి విమర్శించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముందుకు సాగుతోందని తెలిపారు. కర్నూలు అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి స్పష్టం చేశారు.

### వినాయక చవితి వేడుకల్లో ప్రజలు సహకరించాలి : మంత్రి టీజీ భరత్

ఈసారి వర్షాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో కర్నూలులో నీటి లభ్యత తక్కువగా ఉంది. అందువల్ల పెద్ద పెద్ద విగ్రహాలు ఏర్పాటు చేయకుండా, అందరూ కలిసి చిన్న పరిమాణంలో మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలని మంత్రి టీజీ భరత్ కోరారు. చిన్న మట్టి విగ్రహాలను నిమజ్జనం చేయడం వల్ల నీటి వినియోగం తక్కువగా ఉండటంతో పాటు, అవసరమైతే ఇంటి వద్దే నిమజ్జనం చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. తాగునీటికి ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో ప్రజలందరూ పరిస్థితిని అర్థం చేసుకుని సహకరించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

# ఓటర్ల జాబితా సవరణ పేరుతో సైబర్ మోసాలు..!

బిఎల్ఓ పేరుతో మోసం.. లింక్ క్లిక్ చేస్తే ఖాతా ఖాళీ..!

ఓటరు వివరాలంటూ ఓటిపి అడిగితే జాగ్రత్త..!

ఎన్నికల సంఘం పేరుతో కొత్త సైబర్ స్కామ్..!

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్

**కర్నూలు క్రైమ్, సెప్టెంబర్ 04, (సీమకిరణం న్యూస్):** ఓటర్ల జాబితా సవరణ, ఓటరు కార్డులో పేర్లు, వివరాల మార్పుల పేరుతో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడే అవకాశం ఉందని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రజలను హెచ్చరించారు. సైబర్ మోసాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. ఎన్నికల సంఘం ప్రతినిధులమంటూ పరిచయం చేసుకొని, ఓటరు వివరాలు తప్పుగా ఉన్నాయని, దరఖాస్తు తిరస్కరణకు గురైందని చెబుతూ సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేసే ప్రయత్నాలు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. అనంతరం వాట్సాప్, ఎస్ఎంఎస్‌ల ద్వారా నకిలీ లింకులు, అనుమానాస్పద ఏపీకే ఫైల్స్ పంపించి, తక్కువ మొత్తంలో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలని కోరుతూ బ్యాంకు ఖాతా, డెబిట్/క్రెడిట్ కార్డు వివరాలు, ఓటిపిలు సేకరించి నగదు కాజేసే అవకాశం ఉందని హెచ్చరించారు.

### ప్రజలు తప్పనిసరిగా పాటించాల్సిన జాగ్రత్తలు

వాట్సాప్, ఎస్ఎంఎస్ ద్వారా వచ్చే తెలియని లింకులు, ఏపీకే ఫైల్స్‌ను ఓపెన్ చేయవద్దు, డౌన్‌లోడ్ చేయవద్దు. చిన్న మొత్తంలో ఫీజు చెల్లించాలంటూ వచ్చే సందేశాలను నమ్మవద్దు. బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం పిన్, సివివి, పాస్‌వర్డ్, ఓటిపి వంటి రహస్య సమాచారాన్ని ఎవరికీ వెల్లడించవద్దు. ఓటరు నమోదు, మార్పులు, చేర్పులకు సంబంధించి అధికారిక ఎన్నికల సంఘం సేవలను మాత్రమే వినియోగించాలి. ఓటరు జాబితా సవరణ, పేరు తిరస్కరణ, వివరాల మార్పులు లేదా చేర్పులపై సందేహాలు ఉంటే సంబంధిత బూత్ లెవల్ ఆఫీసర్ (బిఎల్ ఓ)ను నేరుగా సంప్రదించి వివరాలను ధృవీకరించుకోవాలి. అనుమానాస్పద ఫోన్ కాల్స్, సందేశాలకు స్పందించకుండా సంబంధిత అధికారుల ద్వారా నిజానిజాలు తెలుసుకోవాలి.

### సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు కాల్ చేయండి

సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్కు సమాచారం అందించాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. అలాగే అధికారిక సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా కూడా ఫిర్యాదు నమోదు చేయాలని తెలిపారు. “అప్రమత్తతే సైబర్ మోసాల నుంచి రక్షణ” అని జిల్లా ప్రజలకు కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు.



# జస్ట్ 4:30 గంటలే 1,170 కిలో మీటర్ల ప్రయాణం.. ఈ నగరాల మధ్య మరో హైస్పీడ్ బుల్లెట్ ట్రైన్!



ఢిల్లీ-పాట్నా మధ్య ప్రయాణించే వారికి కేంద్ర రైల్వే శాఖ శుభవార్త చెప్పింది. ఈ రూట్‌లో దేశంలోనే రెండో హైస్పీడ్ బుల్లెట్ రైలు ప్రాజెక్ట్‌కు సన్నాహాలు చేస్తోంది.ఈ ప్రాజెక్ట్ పూర్తయితే 1170 కి.మీ. దూరాన్ని ప్రస్తుతం 12 గంటల నుండి కేవలం 4 గంటల 30 నిమిషాలకు తగ్గించనుంది. ఇది ప్రయాణికులకు చాలా వరకు సమయాన్ని ఆదా చేయనుంది. ఢిల్లీ-పాట్నా మధ్య రాకపోకలు సాగించే ప్రయాణికులకు కేంద్ర రైల్వే శాఖ అదిరిపోయే శుభవార్త చెప్పింది. ఎప్పుడూ ప్రయాణికులతో రద్దీగా ఉండే ఈ రూట్‌లో అత్యాధునిక హై-స్పీడ్ బుల్లెట్ ట్రైన్ నడిపేందుకు సన్నాహాలు చేస్తోంది రైల్వేశాఖ. ప్రస్తుతం ముంబై-అహ్మదాబాద్ మధ్య నిర్మిస్తున్న తొలి బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్ట్ పూర్తైన వెంటనే దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన తదుపరి హై-స్పీడ్ కారిడార్‌గా ఢిల్లీ-పాట్నా మార్గం నిలవనుందని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ స్పష్టం చేశారు. ప్రస్తుతం ఢిల్లీ నుంచి పాట్నాకు ట్రైన్‌లో వెళ్లాలంటే సుమారు 12 గంటల కంటే ఎక్కువ సమయమే పడుతోంది. దీంతో ప్రయాణికులు దాదాపు సగం రోజులు ఇక్కడే గడిచిపోతుంది. అయితే, ఇప్పుడు కొత్తగా నిర్మించబోయే బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్ట్ గనుక పూర్తయితే ఈ 1,170 కిలోమీటర్ల ఈ దూరాన్ని కేవలం 4 గంటల 30 నిమిషాల్లోనే చేరుకోవచ్చని అధికారులు అంచనా వేశారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా నార్త్ ఇండియాలో కీలక చారిత్రక, పారిశ్రామిక నగరాల మధ్య ప్రయాణ సమయం చాలా వరకు తగ్గనుంది. మన స్టేషన్ వారిగా ఈ ట్రైన్ జర్నీ సమయాన్ని అంచా వేస్తే.. ఢిల్లీలో స్టార్ట్ అయిన ఈ ట్రైన్ ఆగ్రా చేరుకోవడానికి 58 నిమిషాలు పడుతుంది. అదే కాన్పూర్‌కు 1 గంట 50 నిమిషాల్లో చేరుకుంటుంది. ఇక లక్నోకు 2 గంటల 12 నిమిషాల్లో రీచ్ అవుతుంది. ప్రయాగ్‌రాజ్ చేరుకోవడానికి 3 గంటలు సమయం పడుతుంది. వారణాసి వచ్చేసరికి 3 గంటల 33 నిమిషాలు అవుతుంది. ఇక చివరి స్టేషనైనా పాట్నాకు చేరుకోవడానికి 4 గంటల 30 నిమిషాలు సమయం పడుతుంది. అయితే ఈ రూట్‌లో బుల్లెట్ ట్రైన్ ఎప్పటిలోపు పూర్తి అవుతుందనే మాత్రం ఇంకా క్లారిటీ లేదు. ప్రస్తుతం ఈ మెగా ప్రాజెక్ట్ ప్రాథమిక ప్రణాళిక, సర్వే దశల్లో ఉందని.. సమగ్ర మార్గ నిర్ధారణ, డిటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్, భూసేకరణ ప్రక్రియలు పూర్తి కాగానే అధికారిక నిర్మాణ షెడ్యూల్‌ను అధికారులు రిలీజ్ చేయనున్నట్టు తెలుస్తోంది. అన్నీ అనుకున్న టైంకి పూర్తయితే ముంబై-అహ్మదాబాద్ ప్రాజెక్ట్ పూర్తయిన వెంటనే ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులు కూడా స్టార్ట్ చేసే అవకాశం ఉంది.

# సత్యసాయి పాఠశాలలో వైభవంగా కృష్ణాష్టమి సంబరాలు...

భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు...





**వెల్దుర్తి సెప్టెంబర్ 4 (సీమ కిరణం న్యూస్ ):** మండల కేంద్రమైన వెల్దుర్తిలోని శ్రీ సత్య సాయి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయము 9గంటలకు కరస్పాండెంట్ జి.వి.రమణ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం నిర్వహించారు, ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు. పూజ కార్యక్రమం అనంతరం విద్యార్థిని విద్యార్థులకు మరియు తల్లిదండ్రులకు ప్రసాద వితరణ గావించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు శ్రీకృష్ణునికి సంబంధించిన పాటలకు అద్భుత నృత్య కళా ప్రదర్శన గావించారు. ఈ కళా ప్రదర్శనను తిలకించిన తల్లిదండ్రులు ఎంతగానో ఆనందించారు. అనంతరం ఉట్టి కార్యక్రమము నిర్వహించారు. ఉట్టి కార్యక్రమం చాలా ఉత్సాహభరితంగా సాగింది. ఈ కార్యక్రమంలో హెచ్ఎం గఫూర్, ఏవో ప్రభాకర్ రాజు, డైరెక్టర్ తిప్పారెడ్డి, సీనియర్ ఉపాధ్యాయులు నూర్ భాషా మహబూబ్ బాషా అయస్వామి సుబ్బన్న మద్దిలేటి పీఈటి పరుశురాం, ఉపాధ్యాయి నిలు, నఫీజ, ఏ.సుజాత, శివలక్ష్మి,జయలక్ష్మి, షాహిన్, నాగలక్ష్మి, వి సుజాత, రేష్మ,రోజా బి, గీత మరియు విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ధర్మ పరిరక్షణకు ప్రతీక శ్రీకృష్ణుడు!

అధర్మంపై ధర్మ విజయం... కృష్ణాష్టమి సందేశం!

భగవద్గీతతో మానవాళికి మార్గదర్శనం చేసిన శ్రీకృష్ణుడు!

ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ



**కర్నూలు ప్రతినిధి, సెప్టెంబర్ 04, (సీమకిరణం న్యూస్):** హిందువులకు అత్యంత పవిత్రమైన పండుగలలో కృష్ణాష్టమి ఒకటని ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. శ్రీకృష్ణ పరమాత్మ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించుకుంటారని తెలిపారు. శ్రీకృష్ణుని అవతారంతో ఈ భూమిపై ఎన్నో విశేషాలు, అద్భుతాలు ఆవిష్కృతమయ్యాయని ఆయన పేర్కొన్నారు. శ్రీకృష్ణ పరమాత్మ తన అద్భుత లీలల ద్వారా ధర్మాన్ని నిలబెట్టి, అధర్మ నిర్మూలనకు కృషి చేశారని అన్నారు. ప్రపంచంలోనే పుణ్యభూమిగా పేరుగాంచిన భారతదేశంలో అనేక భిన్న సంస్కృతులు, సంప్రదాయాలు, మతాలు ఆవిర్భవించాయని డాక్టర్ శంకర్ శర్మ తెలిపారు. పురాతన కాలంలో మహర్షులు తమ తపోశక్తితో వేదాలు, ఉపనిషత్తులను ప్రపంచానికి అందించారని పేర్కొన్నారు. వేదాలు, ఉపనిషత్తుల సారాంశాన్ని శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీత రూపంలో అర్జునుడికి హితోపదేశం చేశారని తెలిపారు. అందుకే భగవద్గీత ప్రతి హిందువుకు ఒక పవిత్ర గ్రంథంగా నిలిచి, మానవాళికి సరైన జీవన మార్గాన్ని చూపుతోందన్నారు. ప్రతి హిందువు తన ధర్మాన్ని ఆచరిస్తూ భారతదేశ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలని డాక్టర్ శంకర్ శర్మ హితవు పలికారు. ధర్మాన్ని ఆచరించడంలో శ్రీకృష్ణ పరమాత్ముని అద్భుత లీలలు, సందేశాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని గుర్తు చేశారు.

# మనిషి చనిపోయాక ఆధార్, పాన్, ఓటర్ ఐడీలను ఏం చేయాలి..? ఈ రూల్స్ గురించి తెలుసుకోండి..




బతికున్నంత కాలం ఆధార్, పాన్, ఓటర్ ఐడీ పత్రాలు ఎంతో అవసరం. మరి వ్యక్తి మరణించిన తర్వాత ఆ డాక్యుమెంట్లను ఏం చేయాలి? వాటిని ప్రభుత్వానికి తిరిగి అప్పగించాలా లేక భద్రపరుచుకోవాలా? కార్డులు దుర్వినియోగం కాకుండా ఉండాలంటే నిబంధనలు ఏం చెబుతున్నాయి? తెలుసుకుందాం. భారతదేశంలో నివసించే ప్రతి పౌరుడికి ఆధార్ కార్డు, పాన్ కార్డు, ఓటర్ ఐడీ వంటివి అత్యంత కీలకమైన గుర్తింపు పత్రాలు. బ్యాంకింగ్ లావాదేవీల నుంచి ప్రభుత్వ పథకాలు, సంక్షేమ ఫలాల వరకు ప్రతిదానికీ ఈ డాక్యుమెంట్లు తప్పనిసరి. అయితే కుటుంబంలో ఎవరైనా వ్యక్తి మరణించిన తర్వాత వారి గుర్తింపు కార్డులతో ఏం చేయాలి? వాటిని ప్రభుత్వానికి తిరిగి అప్పగించాలా లేక భద్రపరచాలా అనే విషయంలో చాలామందికి స్పష్టత ఉండదు. అటువంటి కీలక పత్రాల విషయంలో పాటించాల్సిన నియమాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలుసుకోవడం చాలా ముఖ్యం.

### ఆధార్ కార్డు

భారత పౌరులకు అత్యంత ముఖ్యమైన ఆధార్ కార్డు విషయంలో నేరుగా కార్డును సరెండర్ చేసే విధానం ప్రస్తుతం అమలులో లేదు. సాధారణంగా కుటుంబ సభ్యులు సంబంధిత మున్సిపాలిటీ లేదా గ్రామ పంచాయతీ నుంచి డెత్ సర్టిఫికేట్ తీసుకుంటారు. ప్రభుత్వం జనన-మరణాల రికార్డులను ఆధార్ డేటాబేస్‌తో అనుసంధానించే వ్యవస్థను అందుబాటులోకి తెచ్చినందున, మరణ ధృవీకరణ పత్రం జారీ కాగానే ఆ వివరాలు నమోదవుతాయి. దీనివల్ల ఆ ఆధార్ నంబర్ దుర్వినియోగం కాకుండా సురక్షితంగా ఉంటుంది.

### పాన్ కార్డు

బ్యాంకు ఖాతాలు, ఆస్తి క్రయవిక్రయాలు, ఆర్థిక లావాదేవీలకు పాన్ కార్డు కీలకం. కుటుంబంలో ఎవరైనా మరణించిన వెంటనే పాన్ కార్డును రద్దు చేయకూడదు. మరణించిన వ్యక్తి పేరిట బ్యాంక్ ఖాతాలు, పెట్టుబడులు, పెండింగ్ ఆదాయపు పన్ను రీఫండ్‌లు ఉంటే, ఆ లావాదేవీలు పూర్తయ్యే వరకు పాన్ కార్డును సురక్షితంగా ఉంచుకోవాలి. ఆర్థిక పరిష్కారాలు, చట్టబద్ధమైన క్లెయిమ్‌లు అన్నీ పూర్తయిన తర్వాత.. చట్టపరమైన వారసులు ఆ పాన్ కార్డును ఆదాయపు పన్ను శాఖకు సరెండర్ చేయవచ్చు. ఇది తప్పనిసరి కాకపోయినా, ఎలాంటి ఆర్థిక మోసాలు జరగకుండా ఉండేందుకు అప్పగించడం మంచిది.

### ఓటర్ ఐడీ -- పాస్‌పోర్ట్

మరణించిన వ్యక్తి పేరిట ఉన్న ఓటర్ ఐడీ దుర్వినియోగం కాకుండా ఉండేందుకు ఎన్నికల సంఘం నియమాలను అనుసరించాలి. స్థానిక ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారికి డెత్ సర్టిఫికేట్‌తో పాటు ఫామ్ 7 సమర్పించడం ద్వారా ఓటరు జాబితా నుంచి ఆ వ్యక్తి పేరును శాశ్వతంగా తొలగించవచ్చు. ఇక పాస్‌పోర్ట్ విషయానికొస్తే, దానిపై నిర్ణీత గడువు ఉంటుంది కాబట్టి కాలపరిమితి ముగిసిన తర్వాత అది దానంతట అదే చెల్లకుండా పోతుంది. దీని కోసం ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు. ఒక వ్యక్తి మరణించిన తర్వాత వారి డాక్యుమెంట్లను ఎట్టిపరిస్థితుల్లోనూ ఇతరుల చేతుల్లోకి వెళ్లకుండా జాగ్రత్త వహించడం ముఖ్యం. సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలు పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో.. చట్టపరమైన లావాదేవీలు పూర్తయ్యాక ఈ పత్రాల వివరాలను సరిగ్గా క్లోజ్ చేయడం కుటుంబ సభ్యుల బాధ్యత.

## 2024లో మల్టీబ్యాగర్లుగా మారిన 7 పెన్నీ స్టాక్స్.. ధర రూ. 50 లోపే



సర్వేలో పాల్గొని ఐఫోన్ 15 గెలుచుకొనే అవకాశం పొందండిఈ స్టాక్ 2024 లో ఇప్పటివరకు ఏకంగా 354 శాతం రిటర్నులు అందించింది. ప్రస్తుతం షేరు ధర రూ. 35 గా ఉంది. గత 6 నెలల్లోనే 628 శాతానికిపైగా పెరిగింది. ఈ కంపెనీ మార్కెట్ విలువ ప్రస్తుతం రూ. 1,810 కోట్లుగా ఉంది.?సన్ షైన్ క్యాపిటల్ - స్టాక్ జనవరి నుంచి ఇప్పటివరకు 227 శాతం పెరిగింది. ప్రస్తుత మార్కెట్ ధర రూ. 4 వద్ద ఉంది. కంపెనీ మార్కెట్ విలువ దాదాపు రూ. 400 కోట్లుగా ఉంది.హిందుస్తాన్ మోటార్స్ –ఈ స్టాక్ ఈ ఏడాది ఇప్పటివరకు 140 శాతం రిటర్నులు ఇచ్చింది. ప్రస్తుతం షేరు దర రూ. 38 వద్ద ఉంది. కంపెనీ మార్కెట్ విలువ రూ. 804 కోట్లుగా ఉంది. 52 వారాల గరిష్ట స్థాయి రూ. 48.60 గా ఉంది.విపుల్ ఎఐజూబక్రీఈ స్టాక్ 2024 లో ఇప్పటివరకు 137 శాతం లాభాలు ఇచ్చింది. ప్రస్తుతం షేరు ధర రూ. 41 వద్ద ఉంది. కంపెనీ మార్కెట్ విలువ రూ. 491 కోట్లుగా ఉంది.పాలిటెక్స్ –ఈ స్టాక్ ఈ ఏడాది ఇప్పటివరకు 112 శాతం రిటర్నులు ఇచ్చింది. ప్రస్తుతం రూ. 12 వద్ద ట్రేడ్ అవుతోంది. కంపెనీ మార్కెట్ విలువ రూ. 315 కోట్లుగా ఉంది.?పీవీపీ వెంచర్స్ –ఈ స్టాక్ 2024 లో 102 శాతం రిటర్నులు ఇచ్చింది. ప్రస్తుతం షేరు ధర రూ. 29 వద్ద ట్రేడ్ అవుతోంది. కంపెనీ మార్కెట్ విలువ రూ. 740 కోట్లుగా ఉంది.విన్ ట్రాన్ ఇన్ఫర్మాటిక్స్ – ఈ స్టాక్ ఈ ఏడాది 101 శాతం రిటర్నులు ఇచ్చింది. ప్రస్తుతం రూ. 30 ధర వద్ద ట్రేడ్ అవుతోంది. కంపెనీ మార్కెట్ విలువ రూ. 235 కోట్లుగా ఉంది.గమనిక: ఈ కథనం కేవలం సమాచారం కోసం మాత్రమే. స్టాక్స్ రికమండేషన్ కాదు. స్టాక్స్ ను కొనుగోలు చేయాలని లేదా విక్రయించాలని ఎకనామిక్ టైమ్స్ సూచించదు.

## మరణించిన వ్యక్తి ఆధార్ కార్డు ఏమౌతుందో తెలుసా..? ఆధార్ క్లోజ్ చేయవచ్చా.





బ్యాంకుకు వెళ్లాలన్నా, రైలు టిక్కెట్టు కొనాలన్నా మనం ముందుగా చూసేది ఆధార్ కార్డు ఉందా లేదా అన్నదే. ఆధార్ కార్డ్ మన గుర్తింపుతో పాటు ముఖ్యమైన పత్రం.ఇది లేకుండా ప్రస్తుతం ప్రభుత్వ, ప్రభుత్వేతర పనులు జరగడం లేదు. అయితే ఒక వ్యక్తి చనిపోతే అతని ఆధార్ కార్డును ఎవరూ దుర్వినియోగం చేయకుండా ఎలా చేయాలి. ఆధార్ కార్డును సరెండర్ చేయవచ్చా లేదా మూసివేయవచ్చా? ఈ కథనంలో తెలుసుకుందాం.ఆధార్ కార్డ్‌పై వ్రాసిన 12 అంకెల ప్రత్యేక సంఖ్య, పేరు, చిరునామా, వేలిముద్ర వంటి అన్ని ముఖ్యమైన సమాచారాన్ని కలిగి ఉంటుంది. అటువంటి పరిస్థితిలో మీరు మీ ఆధార్ కార్డు గురించి చాలా జాగ్రత్తగా ఉండాలి. తద్వారా ఎవరూ దానిని దుర్వినియోగం చేయలేరు. ఒక వ్యక్తి చనిపోయినప్పుడు ఆధార్ కార్డుకు ఏమి జరుగుతుందో మీరు ఎప్పుడైనా ఆలోచించారా? మరణించిన వ్యక్తి ఆధార్ కార్డును సరెండర్ చేయాలా లేదా మూసివేయాలా? టాప్ వేరియంట్.. కొనేముందు ఇవి తెలుసుకోండి!ఆధార్ కార్డును జారీ చేస్తుంది. మీరు మైనర్లు, నవజాత శిశువుల కోసం కూడా ఆధార్ కార్డును తీసుకోవచ్చు. ఒక వ్యక్తి చనిపోయినప్పుడు అతని ఆధార్ కార్డును సరెండర్ చేయడం లేదా మూసివేయడం గురించి ఇంకా ఎటువంటి నియమాలు రూపొందించబడలేదు. అంటే మీరు మీ ఆధార్ కార్డును సరెండర్ చేయలేరు లేదా రద్దు చేయలేరు.అయితే ఆధార్ కార్డును సురక్షితంగా ఉంచడానికి ఆధార్ లాక్ సౌకర్యాన్ని అందిస్తుంది.ఆధార్ కార్డును లాక్ చేసిన తర్వాత దానిని ఉపయోగించలేరు. ఆధార్ కార్డును ఉపయోగించాలంటే ముందుగా దాన్ని అన్‌లాక్ చేయాలి. మీ కుటుంబంలో ఎవరైనా చనిపోతే మీరు అతని ఆధార్ కార్డును లాక్ చేయవచ్చు లేదా ఆధార్ కార్డ్‌ను ఎవరూ దుర్వినియోగం చేయకుండా సురక్షితంగా ఉంచుకోవచ్చు.

## ప్రపంచాన్నే వణికిస్తున్న ఒకే ఒక చిన్న కీటకం.. డైనోసార్లకంటే భయంకరంగా




కొన్ని విషయాలు వినడానికి సింపుల్‌గా అనిపిస్తుంటాయి కానీ.. అవి మాత్రమే తీవ్రంగా ప్రభావితం చేస్తుంటాయి. కొన్ని సమస్యలు ఇతరులు చెప్తుంటే విని ఓష్..అంతేనా.. అనుకుంటాం కానీ.. వాటి బాధ ప్రాబ్లమ్ ఫేస్ చేస్తున్నవారికే బాగా అర్థం అవుతుంది. ప్రజెంట్ బొద్దింకల విషయంలోనూ అదే జరుగుతోంది. చూడటానికి చిన్నగానే ఉండే ఈ కీటకాలు ఇండ్లల్లో, ఆఫీసుల్లో తిరగాడుతూ పెద్ద తలనొప్పిగా మారుతున్నాయి. వాటిని పారదోలడానికి ఎంత ప్రయత్నించినా చాలామంది విఫలం అవుతున్నారు. ఎందుకిలా?శరీర నిర్మాణంలోనే ప్రత్యేకతలుప్రపంచంలోనే అత్యంత పురాతనమైన కీటకాల్లో బొద్దింకలు ఒకటి. పరిమాణంలో చిన్నవే అయినా ఇవి అన్ని రకాల పర్యావరణ, వాతావరణ పరిస్థితులను తట్టుకుంటూ మనగలుగుతున్నాయి. వ్యర్థ పదార్థాలు, సబ్బులు, వాల్ పేపర్, పెయింట్, టపాసుల జిగురు, గుడ్డ ముక్కలు, బుక్ బైడింగ్‌లు, కేబుల్ వైర్లు.. ఇలా ప్రతిదీ వీటికి ఆహారంగా ఉపయోగపడుతుంది. దీంతోపాటు బొద్దింకలు తమ శరీర నిర్మాణంలోనే ప్రత్యేక లక్షణాలు, సామర్థ్యాలు కలిగి ఉంటాయని చెప్తున్నారు. అందుకే ఎవరైనా బొద్దింకల పట్టుకున్నప్పటికీ ఆ సందర్భంలో అవి పట్టుకున్న కాళ్ల భాగం నుంచి తమ శరీరాన్ని తెంచేసుకొని పారిపోతాయి. తర్వాత వాటికి కొత్త కాళ్లు కూడా వస్తాయి.డైనోసార్లకంటే కంటే బలమైనవి!శత్రువుల నుంచి, ప్రకృతి వైపరీత్యాల నుంచి తమను తాము రక్షించుకునే ఈ ప్రత్యేక లక్షణాలు బొద్దింకలలో సహజంగానే ఉంటున్నాయి. కాబట్టి అవి డైనోసార్లకంటే బలవంతమైనవని, భూమిపై అణుయుద్ధం జరిగినప్పటికీ అవి మనుగడసాగిస్తాయని నిపుణులు పేర్కొంటున్నారు. ఇటువంటి శారీరక లక్షణాల మూలంగానే పురాతన కాలంలో గ్రహశకలాలు భూమిని ఢీకొన్నప్పుడు, డైనోసార్లు నశించాయి కానీ బొద్దింకలు మాత్రం మనుగడ సాగించాయని చెప్తున్నారు.పరిస్థితులకు అనుగుణంగా..ఎటువంటి వెదర్‌లో అయినా తట్టుకోగలిగేలా బొద్దింకలు తమ శరీరాలను కుదించుకుంటాయి. పైగా వాటి శరీరాలు చదునుగా ఉంటాయి. దీని కారణంగా ఇబ్బందికర పరిస్థితుల్లో ఈజీగా తప్పించుకోగలుగుతాయి. ఎండ, వాన, వివిధ పరిస్థితుల్లో తాకిడి, ఉష్ణోగ్రతల్లో హెచ్చు తగ్గులు సంభవించినప్పుడు చాలా జంతువులు ఇబ్బంది పడుతుంటాయి. వాటికి తలదాచుకోవడం కూడా కష్టంగా ఉంటుంది. కానీ బొద్దింకలకు ఆ ప్రాబ్లం అస్సలు ఉండదు. అవి ఏ పరిస్థితుల్లోనైనా చిన్న ఆకుచాటునో, నేల పగుళ్లలోనో ఆశ్రయం పొందుతాయి.ప్రమాదాన్ని పసిగట్టగానే..ఏదైనా ప్రమాదం సంభవిస్తుందని పసిగట్టగానే అవి తమ శరీరాన్ని కుంచింపజేసుకుని గుండ్రంగా ముడుచుకుంటాయి. అందుకే ప్రస్తుతం విపరీతమైన చలి ప్రాంతమైన అంటార్కిటికాలో మినహా ప్రపంచ వ్యాప్తంగా బొద్దింకలు పెద్ద సమస్యగా మారుతున్నాయి. అంటార్కిటికా వాతావరణంలో కూడా మూడు రోజులు బతికేస్తాయట. శాస్త్రవేత్తల ప్రకారం.. బొద్దింకలు 35 మిలియన్ సంవత్సరాల నుంచి ఈ భూమిపై మనుగడ సాగిస్తున్నాయి. వీటిని శాశ్వతంగా ఎలా నివారించాలో ఇప్పటికీ పరిష్కారంలేని సమస్యగానే మిగిలిపోయింది.

## జియో యూజర్లకు అంబానీ గుడ్‌న్యూస్ అతి తక్కువ ధరల్లోనే జియో 5జీ స్మార్ట్ ఫోన్




రిలయన్స్ జియో ఏ నిర్ణయం తీసుకున్న అది సంచలనమే. టెలికం రంగంలో దూసుకుపోతున్న జియో.. ఇప్పుడు మరో కీలక నిర్ణయం తీసకోబోతోంది. జియో నుంచి 5జీ స్మార్ట్‌ఫోన్‌ను తీసుకురానుంది.5 స్మార్ట్‌ఫోన్‌లో 6జీబీ ర్యామ్‌తో వస్తుంది. అంతేకాకుండా 128జీబీ, 256జీబీ ఇంటర్నల్ స్టోరేజీతోఉండనుంది. ఈ స్మార్ట్‌ఫోన్‌లో 16–మెగాపిక్సెల్ ప్రైమరీ కెమెరాను, 6–మెగాపిక్సెల్ సెల్ఫీ కెమెరా కూడా ఉంటుంది.ఈ స్మార్ట్‌ఫోన్‌లో 5000%పొూష్ట% బ్యాటరీని కలిగి ఉంటుంది. మీరు 33 ఫాస్ట్ ఛార్జర్‌ని ఉపయోగించి సులభంగా ఛార్జ్ చేయవచ్చు. ఈ స్మార్ట్‌ఫోన్ పూర్తిగా ఛార్జ్ చేయడానికి 30 నిమిషాలు మాత్రమే పడుతుందట. 2 రోజుల వరకు ఛార్జింగ్ వస్తుంది.ఈ స్మార్ట్‌ఫోన్ డిస్‌ప్లే గురించి మాట్లాడినట్లయితే, ఇది 5.5 అంగుళాల డిస్‌ప్లేను కలిగి ఉంటుంది. దీనిలో మీరు 4 నాణ్యతతో వీడియోలను సులభంగా చూడవచ్చు.ఇప్పుడు చాలా మంది స్మార్ట్‌ఫోన్ ఎప్పుడు లాంచ్ అవుతుందని ఎదురు చూస్తున్నారు. ఈ స్మార్ట్‌ఫోన్ అధికారిక లాంచ్ తేదీ ఇంకా ప్రకటించలేదు. మీడియా నివేదికల ప్రకారం.. ఈ స్మార్ట్‌ఫోన్ జూన్ రెండవ లేదా మూడవ వారంలో విడుదలయ్యే అవకాశం ఉంది.ఈ స్మార్ట్‌ఫోన్‌కు సంబంధించిన మొత్తం సమాచారాన్ని, విడుదల తేదీని కూడా పొందవచ్చు.ఈ స్మార్ట్‌ఫోన్ ధరను కూడా త్వరలో వెల్లడి కానుంది. అయితే ఈ ఫోన్ విడుదల సమయంలో రూ.3000 వరకు ఉండే అవకాశం కనిపిస్తోంది.

## రానున్న రోజుల్లో 36 శాతానికిపైగా పెరిగే అవకాశమున్న 5 మిడ్ క్యాప్ స్టాక్స్



విభిన్న రంగాలకు చెందిన ఐదు మిడ్ క్యాప్ స్టాక్స్ రాబోయే రోజుల్లో 36 శాతానికిపైగా రిటర్నులు అందించే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. వీటికి సంబంధించిన వివరాలు కింది కథనంలో..ఐదు మిడ్ క్యాప్ స్టాక్స్ రాబోయే రోజుల్లో 37 శాతం వరకు వృద్ధి నమోదు చేసే అవకాశం ఉందని స్టాక్ మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. వీటి పనితీరు గత నెలతో పోల్చితే మెరుగుపడినట్లు తెలిపారు. విభిన్న రంగాలకు చెందిన ఈ స్టాక్స్ కు సంబందించిన వివరాలు ఇప్పుడు చూద్దాం. సర్వేలో పాల్గొని ఐఫోన్ 15 గెలుచుకొనే అవకాశం పొందండిగేట్ వే డిస్ట్రిపార్క్ఈ స్టాక్ రానున్న రోజుల్లో 36.5 శాతం వరకు పెరగవచ్చని 13 మంది విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. బై రేటింగ్ ఇచ్చారు. గత ఏడాది కాలంలో ఈ స్టాక్ 70.9 శాతం రిటర్నులు అందించింది. కంపెనీ మార్కెట్ విలువ రూ. 5,199 కోట్లుగా ఉంది. ఇది లాజిస్టిక్ కంపెనీ. ముంబై కేంద్రంగా వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ప్రస్తుతం షేరు ధర రూ. 108 గా ఉంది. 52 వారాల గరిష్ట స్థాయి రూ. 121 గా ఉంది.యూటీఐ ఏఎంసీఈ స్టాక్ రాబోయే రోజుల్లో 27.2 శాతం వరకు వృద్ధి చెందే అవకాశం ఉందని 12 మంది అనలిస్టులు అంచనా వేస్తున్నారు. దీనికి హెూల్డ్ రేటింగ్ ఇచ్చారు. గత ఏడాది కాలంలో ఈ స్టాక్ 37.4 శాతం రిటర్నులు ఇచ్చింది. కంపెనీ మార్కెట్ విలువ రూ. 11,408 కోట్లుగా ఉంది. ఇది మ్యూచువల్ ఫండ్ కంపెనీ. ప్రస్తుతం షేరు ధర రూ. 921 వద్ద ట్రేడ్ అవుతోంది. 52 వారాల గరిష్ట స్థాయి రూ. 651 గా ఉంది.గ్రీన్ లామ్ ఇండస్ట్రీస్ఈ స్టాక్ రాబోయే రోజుల్లో 24.8 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని 10 మంది అనలిస్టులు భావిస్తున్నారు. బై రేటింగ్ ఇచ్చారు. గత ఏడాది కాలంలో ఈ స్టాక్ 70.4 శాతం లాభాలు ఇచ్చింది. కంపెనీ మార్కెట్ విలువ రూ. 6,843 కోట్లుగా ఉంది. ఈ కంపెనీ అలంకరణ ఉత్పత్తులను తయారు చేస్తుంది. ప్రస్తుతం షేరు ధర రూ. 584 వద్ద ఉంది. 52 వారాల గరిష్ట స్థాయి రూ. 637 గా ఉంది.కిర్లోస్కర్ ఆయిల్ ఇంజిన్స్ఈ స్టాక్ రానున్న రోజుల్లో 22.5 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని ముగ్గురు అనలిస్టులు అంచనా వేస్తున్నారు. స్ట్రాంగ్ బై రేటింగ్ ఇచ్చారు. గత ఏడాది కాలంలో ఈ స్టాక్ 161.9 శాతం రిటర్నులు ఇచ్చింది. కంపెనీ మార్కెట్ విలువ రూ. 15,989 కోట్లుగా ఉంది. ఈ కంపెనీ ఇంజిన్లు, జెన్ సెట్లు, పంపు సెట్లు, ఇతర విడి భాగాల తయారీలో నిగమ్నమై ఉంది. ప్రస్తుతం షేరు ధర రూ. 1,354 గా ఉంది. 52 వారాల గరిష్ట స్థాయి రూ. 1,365 గా ఉంది.సంబంధిత వార్తలు గతేడాది అక్షయ తృతీయ నుంచి ఈ అక్షయ తృతీయ వరకు మల్టీబ్యాగర్ రిటర్నులు ఇచ్చిన గోల్డ్ స్టాక్స్..అదిరిపోయే లాభాలు ఇచ్చిన టాటా స్టీల్ మద్దతు గల పెన్నీ స్టాక్.. 2024లోనే 148 శాతం రిటర్నులు.. ఒక్క వారంలోనే 15 నుంచి 80 శాతం వరకు పెరిగిన 8 పెన్నీ స్టాక్స్.. ధర రూ. 5 లోపే..అర్కియన్ కెమికల్ ఇండిస్ట్రీస్ఈ స్టాక్ రాబోయే రోజుల్లో 15.9 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని ఇద్దరు అనలిస్టులు భావిస్తున్నారు. స్ట్రాంగ్ బై రేటింగ్ ఇచ్చారు. గత ఏడాది కాలంలో ఈ స్టాక్ 15.6 శాతం రిటర్నులు ఇచ్చింది కంపెనీ మార్కెట్ విలువ రూ. 7,822 కోట్లుగా ఉంది. షేరు ధర ప్రస్తుతం రూ. 837 వద్ద ట్రేడ్ అవుతోంది. 52 వారాల గరిష్ట స్థాయి రూ. 837 గా ఉంది.గమనిక: ఇది కేవలం విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. ఎకనామిక్ టైమ్స్ స్టాక్స్ ను కొనుగోలు చేయాలని లేదా విక్రయించాలని సూచించదు. స్టాక్స్ లో పెట్టుబడి పెట్టే ముందు నిపుణుల సలహా తీసుకోవడం మంచిది.

## ఎంసీఎక్స్‌లో తగ్గిన బంగారం ధర.. ఇక గోల్డ్ రేట్లు దిగొస్తాయా? నిపుణుల మాటేంటి?



బంగారం ధరలు రికార్డ్ స్థాయికి చేరుకున్న సంగతి తెలిసిందే. రోజు రోజుకు పెరుగుతున్న ధరలు ఆందోళన కలిగిస్తున్నాయి. అయితే, ఇవాళ ఎంసీఎక్స్ మార్కెట్‌లో బంగారం ధరలు అర శాతం మేర దిగివచ్చాయి. మరి దేశీయంగా గోల్డ్ రేట్లు ఇక దిగివస్తాయా? వరుసగా తగ్గుదల నమోదవుతుందా? బులియన్ మార్కెట్ నిపుణులు ఏమంటున్నారు? ఓసారి తెలుసుకుందాం. మంగళవారం మే 21వ తేదీన దేశీయ ఫ్యూచర్స్ మార్కెట్‌లో ఉదయం ట్రేడింగ్ సెషన్‌లో బంగారం ధరలు గణనీయంగా తగ్గాయి. స్పాట్ మార్కెట్ల నుంచి తగ్గిన డిమాండ్, బలహీనమైన ప్రపంచ మార్కెట్ల సంకేతాలు ఇందుకు కారణంగా తెలుస్తోంది. మరోవైపు.. అమెరికా డాలర్ విలువ పెరగడంతో బులియన్ అనేది సేఫ్ హెవవెన్ అంచనాలను తగ్గించింది. దీంతో అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలు రికార్డ్ హై నుంచి దిగివచ్చాయి. ఈ క్రమంలో దేశీయంగా బంగారం ధరలు ఇక తగ్గుముఖం పడతాయా? బులియన్ మార్కెట్ నిపుణులు ఏమంటున్నారు?మరోవైపు.. బుధవారం విడుదల కానున్న ఫెడరల్ రిజర్వ్ చివరి పాలసీ మీటింగ్ నిర్ణయాల కోసం పెట్టుబడిదారులు జాగ్రత్తగా ఎదురుచూస్తున్నారు. ఇటీవలి కాలంలో బంగారం ధరలను పెంచే ప్రధాన కారణాలలో ఫెడ్ వడ్డీ రేట్ల తగ్గింపు అంచనాలు ఒకటిగా చెప్పవచ్చు. దాంతో పాటు భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ద్రవ్యోల్బణం, స్థూల ఆర్థిక అనిశ్చితులు సైతం బంగారం ధర ఈ ఏడాది రికార్డు స్థాయిలను తాకేందుకు దోహదపడ్డాయి. దేశీయ మార్కెట్లో జూన్ 5 డెలివరీలకు సంబంధించిన ఎంసీఎక్స్ గోల్డ్ ధర ఉదయం 11 గంటలకు 0.64 శాతం తగ్గి 10 గ్రాములకు రూ.73,892గా నమోదైంది.మరి ఎంసీఎక్స్ మార్కెట్లో ధరలు తగ్గిన క్రమంలో బంగారం కొనుగోలుదారుల వ్యూహాలు ఏమిటి? నిపుణులు ఏం చెబుతున్నారు? అంటే రానున్న రోజుల్లోనూ బంగారం ధరల్లో అస్థిరత కొనసాగవచ్చని బులియన్ మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. అంటే మరి కొన్ని రోజుల పాటు హెచ్చుతగ్గులు కొనసాగుతాయని అర్థమవుతోంది. కామెక్స్ గోల్డ్ ధరలు సోమవారం రోజున ఔన్సుకు 2454 డాలర్ల ఆల్ టైమ్ హై నుంచి దిగివచ్చినట్లు కోటక్ సెక్యూరిటీస్ సీనియర్ మేనేజర్ కన్యాంత్ ఛైన్వాలా తెలిపారు. ఫెడ్ అధికారుల వ్యాఖ్యలు బంగారం ధరల తగ్గింపునకు కారణమైనట్లు చెప్పారు.

## జాగ్రత్త నాన్ స్టిక్ వంటసామాన్లు వాడితే డేంజర్..




ప్రస్తుతం చాలామంది ఇంట్లో ఉన్న కిచెన్లు అద్దంలా మెరుస్తున్నాయి. ఎందుకంటే కిచెన్ లో ఎక్కువగా నాన్ స్టిక్ పాత్రలే వాడుతున్నారు. ఇవి వాడటం వల్ల బౌల్స్ క్లీన్ చేయడం ఈసీ, ఫుడ్ ఆయిల్ కూడా ఆదా అవుతుంది.కానీ.. వీటి వల్ల ఆరోగ్యానికి ముప్పు ఉందని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ తేల్చి చెప్తోంది. హై టెపరేచర్ లో నాన్ స్టిక్ పై వంట చేసినప్పుడు అందులో నుంచి టాక్సిన్స్ విడుదల అవుతాయని %×జవీ=% హెచ్చరిస్తుంది.నాన్ స్టిక్ పాత్రలతో ఈ రోగాలు వస్తాయినాన్ స్టిక్ ప్యాన్ పై ఉన్న టెఫ్లాన్ కోట్టింగ్ అరిపోయినట్లైతే వాటిని వాడకూదని తాజాగా %×జవీ=% మార్గదర్శకాలు విడుదల చేసింది. నాన్?స్టిక్ పాత్రలను ఉపయోగించడం వల్ల క్యాన్సర్, సంతానోత్పత్తి, శరీర నొప్పులు, హార్మోన్లలో అసమతుల్యత, తలనొప్పి వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తవచ్చని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ వెల్లడించింది.మనం యూజ్ చేసే నాన్?స్టిక్ పాత్రలను పాలీ టెట్రాఫ్లోరో ఎథిలిన్(%ూఖీజు%) అనే పదార్థంతో తయారుచేస్తారు. ఈ పదార్థాన్నే టెఫ్లాన్ అని కూడా పిలుస్తారు. కార్బన్, ఫ్లోరిన్ పరమాణువులతో టెఫ్లాన్ అనే సింథటిక్ రసాయన పదార్థం తయారవుతుంది. దీన్ని అడుగు భాగాన పోతగా పోసి నాన్?స్టిక్ పాత్రలను తయారు చేస్తారని నిపుణులు చెబుతున్నారు. ఆ విధంగా తయారుచేసిన నాన్?స్టిక్ పూతపై ఏ చిన్న గీత పడినా టెఫ్లాన్ కోటింగ్ నుంచి విష వాయువులు, డేంజర్స్ కెమికల్స్ కుక్ చేసుకునే పదార్థాల్లో కలుస్తాయని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ పరిశోదనలో తేలింది. ఒక్క గీత నుంచి 9,100 మైక్రోప్లాస్టిక్ రేణువులు రిలీజ్ అవుతాయని ఐసీఎంఆర్ పేర్కొంది.ప్రమాదాన్ని తగ్గించాడనికి జాగ్రత్తలు:– ఖాళీ ప్యాన్ ను ఎక్కువ సేపు వేడి చేయొద్దు. ఇలా చేస్తే టెఫ్లాన్ పూత త్వరగా కరిగిపోతుంది.– వీలైనంత తక్కువ మంటపై వంటచేసుకోవాలి. 170 డిగ్రీస్ సెల్సియస్ కంటే ఎక్కువ టెంపరేచర్ లో వేడి చేస్తే నాన్ స్టిక్ డేంజరెస్ వాయువులను విడుదల చేస్తుంది.– ఎటువంటి రసాయన పూతలు లేని గ్రానైట్ పాత్రలు, మట్టిపాత్రలు, ఫుడ్ గ్రేడ్ స్టెయిన్‌లెస్ స్టీల్, లేని సిరామిక్ పాత్రలు వంట చేసుకోవడానికి బెస్ట్ అని ఐసీఎంఆర్ చెప్తోంది.– నాన్ స్టిక్ కోటింగ్ ను డ్యామేజ్ ( గీతలు) అయ్యేందుకు కారణమైయ్యే మెటల్ స్పూన్స్, స్టీల్ గంటెలు వాడకుండా సిలికాన్, చెక్క గరిటెలను ఉపయెగించండి.– నాన్ స్టిక్ కోటింగ్ అరిగిపోయిన ప్యాన్స్, బౌల్స్ కు బదులు కొత్త పాత్రలు వాడాలి.

## 6 నెలల్లోపే జీవిత కాల గరిష్టానికి బీఎస్ఈ.. 5 లక్షల కోట్ల డాలర్లకు ఎం-క్యాప్



దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం సరికొత్త రికార్డు నమోదు చేశాయి. బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ 5 లక్షల కోట్ల డాలర్ల (రూ.414.75 లక్షల కోట్లు) మైలురాయిని దాటింది. ఈ మార్కును దాటడం ఇదే తొలిసారి. జూన్ నాలుగో తేదీన లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో స్టాక్ మార్కెట్లు లాభాల్లో సాగుతున్నాయి. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు స్టాక్స్ విక్రయిస్తున్నా దేశీయ ఇన్వెస్టర్ల నుంచి స్టాక్స్‌కు కొనుగోళ్ల మద్దతు లభించింది.2023 నవంబర్ 29 నాటికి బీఎస్ఈ లిస్టె కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ 4 లక్షల కోట్ల డాలర్ల మార్కును దాటింది. కేవలం ఆరు నెలల్లోపే బీఎస్ఈ ఎం–క్యాప్ లక్ష కోట్ల డాలర్లు పుంజుకోవడం గమనార్హం. మరోవైపు నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ ఆల్ టైం గరిష్టానికి 250 పాయింట్ల దూరంలో నిలిచింది. స్మాల్ క్యాప్, మిడ్ క్యాప్ ఇండెక్సులు కొత్త గరిష్టాలకు దూసుకెళ్లాయి.దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు, రిటైల్ ఇన్వెస్టర్లు, అత్యంత సంపన్నుల (హెచ్ఎన్ఐఎన్) మద్దతుతో స్టాక్ మార్కెట్లలో బుల్ పరుగులు తీసింది. ఈ నెలలో దలాల్ స్ట్రీట్ నుంచి రూ.28 వేల కోట్ల లోపు విలువైన స్టాక్స్‌ను విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు విక్రయించారుమెటల్, పవర్, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలకు ఇన్వెస్టర్ల నుంచి కొనుగోలు మద్దతు లభించింది. ఎనిమిది సెషన్లలో బీఎస్ఈలో ర్యాలీ కొనసాగింది. ఫలితంగా ఇన్వెస్టర్ల సంపద రూ.21.27 లక్షల కోట్లు పెరిగింది. గత మార్చి 13 నుంచి బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.372.17 లక్షల కోట్ల నుంచి రూ.42.46 లక్షల కోట్లు పెరిగింది.మంగళవారం ఉదయం బీఎస్ఈ సెన్సెక్స్ 73,842.96 పాయింట్ల వద్ద నష్టాలతో మొదలైంది. అంతర్గత ట్రేడింగ్‌లో 74,189.19 పాయింట్ల గరిష్టానికి దూసుకెళ్లి 73,762.37 పాయింట్ల కనిష్టానికి పడిపోయింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి 52.63 పాయింట్లు కోల్పోయి 73,953.31 పాయింట్ల వద్ద నిలిచింది. మరోవైపు ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 27.05 పాయింట్ల లబ్ధితో 22,529.05 పాయింట్ల వద్ద ముగిసింది. అమెరికా డాలర్‌పై రూపాయి మారకం విలువ 83.31 వద్ద ముగిసింది. బీఎస్ఈ సెన్సెక్స్‌లో టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, టెక్ మహీంద్రా, ఎన్టీపీసీ లబ్ధి పొందగా, నెస్లే ఇండియా, మారుతి సుజుకి, ఐసీఐసీఐ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, హిందూస్థాన్ యూనీ లివర్ (హెచ్‌యూఎల్) స్టాక్స్ నష్టాలతో ముగిశాయి.

## ఆడీ నుంచి క్యూ7 బోల్డ్ ఎడిషన్ ఆవిష్కరణ..!




ప్రముఖ జర్మనీ కార్ల తయారీ సంస్థ ఆడి తన క్యూ7 ఎస్‌యూవీ కారులో స్పెషల్ ఎడిషన్ 'చిరిస్టెన్డ్ ఆడి క్యూ7 బోల్డ్ ఎడిషన్' కారును ఆవిష్కరించింది. ఎ ప్రముఖ జర్మనీ కార్ల తయారీ సంస్థ ఆడి తన క్యూ7 ఎస్‌యూవీ కారులో స్పెషల్ ఎడిషన్ 'చిరిస్టెన్డ్ ఆడి క్యూ7 బోల్డ్ ఎడిషన్' కారును ఆవిష్కరించింది. ఈ కారు ధర రూ.97.84 లక్షలు (ఎక్స్ షోరూమ్) పలుకుతుంది. ఆడీ క్యూ7 బోల్డ్ ఎడిషన్ కారు బ్లాక్ స్టైలింగ్ ప్యాకేజీ, ఫ్రంట్ అండ్ రేర్‌లో బ్లాక్డ్ ఔట్ ఆడి రింగ్స్ తోపాటు గ్లాస్ బ్లాక్ ఫ్రంట్ గ్రిల్లె , బ్లాక్ విండో, ఓఆర్వీఎంస్, రూఫ్ రెయిల్స్ వంటి ఫీచర్లు ఉన్నాయి. మ్యాట్రిక్స్ ఎల్ఈడీ హెడ్ ల్యాంప్స్, 19–అంగుళాల అల్లాయ్ వీల్స్ ఉంటాయి. ఈ కారు నాలుగు ఎక్స్‌టీరియర్ రంగులు గ్లాసియర్ వైట్, మైథోస్ బ్లాక్, నవర్రా బ్లూ, సమురాయ్ గ్రే రంగుల్లో లభిస్తుంది. ఈ కారు లిమిటెడ్ యూనిట్లు మాత్రమే ఉత్పత్తి చేస్తుంది.ఇంకా క్యాబిన్‌లో డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, టచ్ స్క్రీన్ ఇన్ఫోటైన్మెంట్ సిస్టమ్ విత్ 19–స్పీకర్ బీ అండ్ ఓ సౌండ్ సిస్టమ్, ఫోర్ జోన్ ఆటోమేటిక్ క్లైమేట్ కంట్రోల్, పార్క్ అసిస్ట్ ప్లస్, 360 డిగ్రీ కెమెరా, పనోరమిక్ సన్ రూఫ్, అంబియెంట్ లైటింగ్ తదితర ఫీచర్లు జత చేశారు. ఈ కారు ఏడు వేర్వేరు డ్రైవ్ మోడ్స్‌లో లభిస్తుంది. 3.0 లీటర్ల టర్బో చార్జ్‌డ్ వీ6 ఇంజిన్ విత్ 48వాట్ల మైల్డ్ హైబ్రీడ్ సిస్టమ్, హైబ్రీడ్ పవర్ ట్రైన్ సెటప్ ఉంటుంది. ఈ ఇంజిన్ గరిష్టంగా 335 బీహెచ్పీ విద్యుత్, 500 ఎన్ఎం టార్క్ వెలువరిస్తుంది. 8–స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్ మిషన్, బ్రాండ్ ఐకానిక్ క్వాట్రో ఆల్ వీల్ డ్రైవ్ (ఏడబ్ల్యూడీ) సిస్టమ్ ద్వారా అన్ని వీల్స్‌కు పవర్ సరఫరా చేస్తుంది.

## నేలకు జారిపడ్డ పసిడి ధర.. ఒక్కరోజే రూ.6,500 తగ్గుదల, కొనుక్కోండి

పసిడి వరుస దూకుడుకు నేడు కళ్లెం పడింది. నిన్న ఇరాన్ అధ్యక్షుడి మృతితో అకస్మాత్తుగా పెరిగిన పసిడి ధరలు నేడు తిరిగి చల్లబడ్డాయి.నేడు ధరల్లో భారీ పతనం కొనసాగటం భారతీయ పసిడి ప్రియులను సంతోషానికి గురిచేసింది. దీంతో అనేక మంది మళ్లీ రేట్లు పెరగకముందరే షాపింగ్ చేయాలని ప్లాన్ చేసుకుంటున్నారు.22 క్యారెట్ల పసిడి ధర 100 గ్రాములకు నేడు నిన్నటితో పోల్చితే రూ.6,000 క్షీణతను నమోదు చేసింది. ఇదే క్రమంలో దేశవ్యాప్తంగా వివిధ నగరాల్లో తగ్గిన రిటైల్ విక్రయ ధరలను పరిశీలిస్తే గ్రాముకు ధర.. చెన్నైలో రూ.6,860, ముంబైలో రూ.6,830, దిల్లీలో రూ.6,845, కలకత్తాలో రూ.6,830, బెంగళూరులో రూ.6,830, కేరళలో రూ.6,830, వడోదరలో రూ.6,835, జైపూరులో రూ.6,845, లక్నోలో రూ.6,845, నాశిక్ లో రూ.6,833, అయోధ్యలో రూ.6,845, బళ్లారిలో రూ.6,830, గురుగ్రాములో రూ.6,845, నోయిడాలో రూ.6,845గా కొనసాగుతున్నాయి.ఇదే క్రమంలో 24 క్యారెట్ల గోల్డ్ రేటు 100 గ్రాములకు నిన్నటితో పోల్చితే రూ.6,500 భారీ క్షీణతను నేడు నమోదు చేసింది. దీంతో దేశంలోని ప్రధాన నగారాల్లో తగ్గిన రిటైల్ విక్రయ ధరలను పరిశీలిస్తే గ్రాముకు.. చెన్నైలో రూ.7,484, ముంబైలో రూ.7,451, దిల్లీలో రూ.7,466, కలకత్తాలో రూ.7,451, బెంగళూరులో రూ.7,451, కేరళలో రూ.7,451, వడోదరలో రూ.7,456, జైపూరులో రూ.7,466, లక్నోలో రూ.7,466, నాశిక్ లో రూ.7,454, అయోధ్యలో రూ.7,466, బళ్లారిలో రూ.7,451, గురుగ్రాములో రూ.7,466, నోయిడాలో రూ.7,466గా ఉన్నాయి.ఏపీ–తెలంగాణలోని నగరాలైన విజయవాడ, గుంటూరు, కాకినాడ, తిరుపతి, నెల్లూరు, అనంతపురం, గుంటూరు, కడప, విశాఖ, హైదరాబాద్, ఖమ్మం, కరీంనగర్, నిజాంబాద్, వరంగల్ నగరాల్లో 22 క్యారెట్ల పసిడి నేటి ధర రూ.6,830గా ఉండగా.. 24 క్యారెట్ల ధర రూ.7,451 వద్ద కొనసాగుతోంది. అలాగే తాజా వెండి ధరలను తెలుగు రాష్ట్రాల్లో రిటైల్ విక్రయ ధరను పరిశీలిస్తే.. ధర కేజీకి నేడు రూ.1,900 తగ్గి రూ.99,000 వద్ద కొనసాగుతోంది.

Editor, Printed, Published and Owned by Shaik Nazeer Ahmed Basha , H.NO. 3-104- 2 , Balajinagar, Kurnool - 518006, (A.P) , Printed at GK PUBLICATIONS , D.NO. 27/66, CHINNA MARKET, DIST. KURNOOL- 518001, ANDHRA PRADESH. E-mail : seemakiranamknl@gmail.com. RNI : APTEL / 2O18/ 76380, Cell : 9133399830, 8919971019. website : - www.seemaakiranam.com , www.seemakiranamnews.com , epaper.seemakiranamnews.com